


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 104 | ఆదివారం 13 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## అర్జెంటీనాలో రాత్రికి రాత్రే వెనక్కి వెళ్లిన సముద్రం..

అర్జెంటీనాలో రాత్రికి రాత్రే సముద్రం ఎండి పోయిందంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వార్తలు తీవ్ర కలకలం రేపాయి. అయితే, ఇది అవాస్తవమని, ప్రకృతి వైపరీత్యం కాదని, కేవలం ఒక తాత్కాలిక సహజ ప్రక్రియ మాత్రమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. - మిగతా2లో



## అధికార పిరమిడ్‌ను బద్దలుకొట్టాలి..

### ప్రపంచ పాలనలో 'గ్లోబల్ సౌత్' వాటా పెరగాలి

● న్యూఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సును లాంఛనంగా ప్రారంభించిన ప్రధాని మోదీ ● ప్రపంచ పాలనలో గ్లోబల్ సౌత్ దేశాలకు కీలక పాత్ర దక్కాలని స్పష్టీకరణ ● అధికారాల పిరమిడ్‌ను భాగస్వామ్య వేదికగా మార్చాలని పిలుపు ● బ్రిక్స్ సంస్కరణల కోసం మూడు స్తంభాలతో రోడ్‌మ్యాప్ ప్రతిపాదన




## సాగునీటి ప్రాజెక్టుల పై చంద్రబాబు చిత్తశుద్ధి అమోఘం: కేంద్రమంత్రి జేపీ నడ్డా

- సాగునీటి ప్రాజెక్టులపై చంద్రబాబు చొరవను కొనియాడిన కేంద్ర మంత్రి నడ్డా
- అమరావతి క్వాంటం బయో వ్యాలీకి కేంద్రం పూర్తి సహకారం
- ఏపీ 'సంజీవని' కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో పరిశీలిస్తామన్న నడ్డా
- సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీ సురక్షితంగా ఉందని ప్రశంస
- 'వంటిల్లే ఫార్మసీ-ఆహారమే ఔషధం' అనే నినాదాన్ని సమర్థించిన కేంద్ర మంత్రి



## గణేశ్ ఉత్సవాల నిర్వహణ పై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు!!



- మున్సిపల్, పోలీసు అధికారులతో భేటీ!
-ఈ నెల 25వ తేదీన గణేష్ నిమజ్జనం

గణేశ్ ఉత్సవాల నిర్వహణకు భాగ్య నగరం సిద్ధం అవుతోంది. ఈ నెల 14వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో గణేష్ మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. - మిగతా2లో

## రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించొద్దు: జగన్ కు నారా లోకేశ్ హితవు



- డీఎస్సీ స్పోర్ట్స్ కోటా పై జగన్ ఆరోపణలకు మంత్రి లోకేశ్ కౌంటర్
-రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానిస్తున్నారని విమర్శ
- బాక్సర్ పెద్ద అప్పలరాజు నేషనల్ ఛాంపియన్ అని వెల్లడి
- ఆధారంగా సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన లోకేశ్
- డీఎస్సీ స్కామ్ పై ప్రభుత్వం సమాధానం చెప్పాలని జగన్ డిమాండ్

## జగన్ చేసిన మంచి పనులను చంద్రబాబు ఆయన ఖాతాలో వేసుకునేందుకు యత్నిస్తున్నారు

కూటమి ప్రభుత్వంపై వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మరోసారి ఆరోపణలు చేశారు. ఏపీ సర్కార్ 'క్రెడిట్ చోరీ' రాజకీయాలకు పాల్పడుతోందని... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ ప్రజలకు చేసిన మంచి పనులను, సాధించిన విజయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.




## ఆదిలాబాద్ విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు వేగంగా పడుతున్నాయి



వాణిజ్యపరంగా,వ్యూహాత్మకంగా కీలకమైన ఆదిలాబాద్ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు వేగంగా పడుతున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ అంశంపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమైనట్లు తెలిపారు.- మిగతా2లో

## బర్తరఫ్ తర్వాత కీలక పరిణామం.. కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు

- మంత్రి పదవి కోల్పోయిన కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు
- వెంటనే రావాలంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దల నుంచి సందేశం
- కేబినెట్ స్థాయి పదవి ఇచ్చే యోచనలో అధిష్ఠానం ఉన్నట్లు సమాచారం
- సురేఖతో నేరుగా మాట్లాడిన తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్



VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 13 సెప్టెంబర్ 2026

# గణేశ్ ఉత్సవాల నిర్వహణ పై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

25వ తేదీన నిమజ్జనంకు నిర్ణయించారు. ఇప్పటికే మున్సిపల్, పోలీసు అధికారులు నిర్వాహకులతో భేటీ అయ్యారు. కీలక సూచనలు చేసారు. కాగా ఈ ఉత్సవాల పైన ముఖ్యమంత్రి రేవంత్ ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భాగ్యనగరంలో గణేశ్ ఉత్సవాలకు ఎలాంటి ఆటంకం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పండుగ వేళ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఏ చిన్న ఇబ్బంది కలగకుండా సహాయ సహకారాలు అందించాలన్నారు. మున్సిపల్, పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని నిర్దేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత వహించాలని సూచించారు. ఇందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలన్నారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని అన్నారు. సమస్యలు ఏమున్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు**

దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు వివరించారు. మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలని సూచించారు. ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుందని పేర్కొన్నారు. నిర్వాహకుల సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా తానే సమీక్ష నిర్వహిస్తున్నానని చెప్పారు. నిర్వాహకులు మండపాలకు అతిథులను ఆహ్వానిస్తే ఆ వివరాలను స్థానిక కమిషనరేట్‌కు అందించాలని విజ్ఞప్తి చేసారు. ఊహించని పరిణామాలు జరిగినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ఆ సమాచారం ఉపయోగపడుతుందని చెప్పారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మల కుంటలు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# సాగునీటి ప్రాజెక్టుల పై చంద్రబాబు చిత్తశుద్ధి అమోఘం: కేంద్రమంత్రి జేపీ నడ్డా

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జీవనాధారమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిస్తున్న చిత్తశుద్ధి, పట్టుదల ప్రశంసనీయమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా కొనియాడారు. కేవలం ఆరోగ్య రంగంపైనే కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే కీలకమైన జలవనరులపైనా ముఖ్యమంత్రికి ఉన్న పట్టు అద్భుతమని ఆయన అన్నారు. శనివారం విజయవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ, హంద్రీ-నీవా వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబు చొరవ రాష్ట్ర ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారానే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, ఈ దిశగా చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పర్యటనకు వచ్చినప్పటికీ, రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఆయన ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించడం గమనార్హం.

**అమరావతి బయో వ్యాలీకి కేంద్రం అండ**

రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయ తలపెట్టిన క్వాంటం బయో వ్యాలీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనను జేపీ నడ్డా స్వాగతించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుపై మరింత లోతుగా చర్చించేందుకు, అవసరమైన సూచనలు చేసేందుకు త్వరలోనే కేంద్రం నుంచి ఒక సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపుతామని వెల్లడించారు. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటుపై ముఖ్యమంత్రి చేసిన సూచనలు, ఆయన విజన్ అద్భుతంగా ఉన్నాయని, వాటిని తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

**'సంజీవని'పై ప్రశంసలు.. జాతీయ స్థాయిలో పరిశీలన**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'సంజీవని' కార్యక్రమంపై నడ్డా ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. ప్రజల ఆరోగ్య రక్షణకు ఈ కార్యక్రమం ఒక గొప్ప ముందడుగని అభివర్ణించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని, ఈ లక్ష్యంతో పనిచేస్తున్న సంజీవని కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో అమలు చేసే అవకాశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు కేంద్రం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**చంద్రబాబు సారథ్యంలో ఏపీ సురక్షితం**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సురక్షితమైన చేతుల్లో ఉందని జేపీ నడ్డా అన్నారు. చంద్రబాబు ఒక దార్శనికుడని, నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా, విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధిలోనూ చంద్రబాబు పోషిస్తున్న పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన "వంటిల్లే ఫార్మసీ-ఆహారమే ఔషధం" అనే మాటను నడ్డా తన ప్రసంగంలో పలుమార్లు ప్రస్తావించారు. ఆ మాటలు నూటికి నూరు శాతం నిజమని, ఆరోగ్యానికి అదే మూల సూత్రమని వ్యాఖ్యానించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారానే వ్యాధులను దూరం చేయగలమని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం తో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించొద్దు: జగన్ కు నారా లోకేశ్ హితవు

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల పై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గట్టిగా బదులిచ్చారు. రాజకీయ విమర్శల కోసం రాష్ట్రం గర్వించదగ్గ క్రీడాకారుడిని అవమానించడం తగదని హితవు పలికారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. "పెద్ద అప్పలరాజు ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ బాక్సర్. ఆయన నేషనల్ ఛాంపియన్. ఆయన సెమీఫైనల్ వీడియోలు ఇప్పటికీ దూరదర్శన్‌లో ఉన్నాయి. రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించడం ఇప్పటికైనా ఆపండి జగన్ గారు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. తన వ్యాఖ్యలకు ఆధారంగా బాక్సర్ అప్పలరాజు ఆడుతున్న పాత వీడియోను కూడా ఆయన షేర్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని జగన్ ఆరోపణలు చేస్తుండడం తెలిసిందే. నిన్న తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ అక్రమాలపై వెంటనే సీబీఐతో విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. క్రీడల కోటాలో జరిగిన అక్రమాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని జగన్ అన్నారు. అసలు జరగని క్రీడలకు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి, కొందరికి పరీక్ష కూడా నిర్వహించకుండానే ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ఆ తప్పుడు సర్టిఫికెట్లను ధ్రువీకరించింది, నియామకాలు జరిపింది కూడా వారేనని విమర్శించారు. ఈ విషయంపై అధికారులు కూడా సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారని, సమర్పించిన స్పోర్ట్స్ సర్టిఫికెట్లు అసలైనవో కావో నిర్ధారించలేకపోతున్నారని తెలిపారు. ఈ కుంభకోణంపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎందుకు స్పందించడం లేదని జగన్ ప్రశ్నించిన నేపథ్యంలో, తాజాగా లోకేశ్ ఓ వీడియో ఆధారంతో కౌంటర్ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# జగన్ చేసిన మంచి పనులను చంద్రబాబు ఆయన ఖాతాలో వేసుకునేందుకు యత్నిస్తున్నారు

ఏపీ సర్కార్ 'క్రెడిట్ చోరీ' రాజకీయాలకు పాల్పడుతోందని. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ ప్రజలకు చేసిన మంచి పనులను, సాధించిన విజయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజలకు పంపిణీ చేసిన భూములపై వారికి సర్వహక్కులు కల్పించే దిశగా జగన్ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని కాకాణి ప్రశంసించారు. అన్ని సామాజికవర్గాలకు న్యాయం చేస్తూ పేదవాడికి భూ యాజమాన్య హక్కులు కల్పించడం కోసం 13మంది ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలతో ప్రత్యేక కమిటీని కూడా జగన్ ఏర్పాటు చేశారని అన్నారు. దశాబ్దాలుగా నలుగు తున్న 'చుక్కల భూముల' సంక్లిష్ట సమస్యను పరిష్కరించడంలో చంద్రబాబు గతంలో పూర్తిగా విఫలమయ్యారని. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దానికి శాశ్వత పరిష్కారం చూపి, అడ్డంకులు లేని భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించిందని తెలిపారు.తాము తీసుకొచ్చిన ఈ భూ సంస్కరణల విధానంతో రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది రైతులకు లబ్ధి చేకూరిందని కాకాణి పేర్కొన్నారు.అయితే ఈ క్రెడిట్ అంతా జగన్‌కు ఎక్కడ దక్కుతుందోనన్న అసూయ తో కూటమి ప్రభుత్వం రీ-వెరిఫికేషన్ పేరుతో ఏకంగా 27 నెలల పాటు కాలయాపన చేశారని మండిపడ్డారు. పేదల సంక్షేమం కోసం గత ప్రభుత్వం చేసిన పనులను తమ సొంత కార్యక్రమాలుగా ప్రచారం చేసుకోవడం మాని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం పై కూటమి నాయకులు దృష్టి పెట్టాలని అన్నారు.

# ఆదిలాబాద్ విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు వేగంగా పడుతున్నాయి

ఈ అంశం పై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమైనట్లు తెలిపారు. ఈ భేటీలో ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పురోగతిపై సమీక్షించినట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు అమలును వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. దీనికి సంబంధించిన కార్యాచరణను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఒక్కో నోడల్ అధికారిని వచ్చే వారంలోగా నియమించాలని నిర్ణయించినట్లు తెలిపారు. జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్‌కు డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పనను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణ కనెక్టివిటీకి సంబంధించి విమానాశ్రయం, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు అవసరాన్ని కేంద్ర మంత్రులకు వివరించినట్లు తెలిపారు.రీజినల్ కనెక్టివిటీని మెరుగుపరచాల్సిన అంశాన్నీ వారి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ మేరకు ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ను అభివృద్ధి చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారన్నారు. అలాగే ఇందుకు అవసరమైన సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని ఆయన హామీ ఇచ్చారని కిషన్ రెడ్డి తెలిపారు. మరోవైపు, ఈ విమానాశ్రయం కోసం ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు.. వరుస సమావేశాలు, లేఖలు, నిరంతర సమన్వయం నేడు తుది దశకు చేరుకోవడం సంతోషంగా ఉందని ఆయన చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష సాకారమయ్యే దిశగా కీలక ముందడుగు పడిందని కేంద్ర మంత్రి హర్షం వ్యక్తం చేశారు. కాగా, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, తెలంగాణ అధికారుల మధ్య ఇప్పటికే పలు సమావేశాలు జరిగాయని కిషన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా రక్షణ, పౌర విమానయాన అధికారులు 17 ఏప్రిల్ 2026న విమానాశ్రయ స్థలాన్ని పరిశీలించారన్నారు. ఈ సందర్భంగా 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణం అవసరమని వారు నిర్ణయించారని తెలిపారు. దీంతోపాటుగా ఐఏఎఫ్ వద్ద ఉన్న 369.45 ఎకరాల భూమికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించిందని చెప్పారు. ఈ భూమిలో ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, విజిటింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్, వెదర్ షెల్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్లు, ఆపరేషనల్ కాంప్లెక్స్, ట్రైనింగ్ ఫెసిలిటీస్, మెయింటెనెన్స్ ఇన్‌ఫ్రా ఫెసిలిటీస్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే పౌర సేవలకు సంబంధించి సివిల్ టెర్మినల్‌తో పాటు నిర్వహణ, మరమ్మతు కార్యకలాపాల కేంద్రాన్ని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేస్తుందన్నారు.

## అధికార పిరమిడ్‌ను బద్దలుకొట్టాలి.. ప్రపంచ పాలనలో 'గ్లోబల్ సౌత్' వాటా పెరగాలి

బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం న్యూఢిల్లీలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వృద్ధికి చోదకశక్తులుగా ఉన్న దేశాలకు ప్రపంచ పాలనలో మరింత కీలక పాత్ర దక్కాలని, ఏకాభిప్రాయంతోనే బ్రిక్స్ కూటమి ముందుకు సాగుతుందని, ఏ దేశానికీ వ్యతిరేకంగా పనిచేయదని స్పష్టం చేశారు. ప్రారంభోపన్యాసంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ప్రస్తుతం అనేక అంతర్జాతీయ సంస్థలలో గ్లోబల్ సౌత్ దేశాలు ముందు వరుసలో ఉంటున్నప్పటికీ, నిర్ణయాధికారంలో మాత్రం వెనుకబడే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ 'అధికారాల పిరమిడ్'ను ప్రతి దేశానికీ గళం వినిపించే, ప్రతి సభ్యునికీ భాగస్వామ్యం ఉండే 'భాగస్వామ్య వేదిక'గా మార్చాలని పిలుపునిచ్చారు. మానవాళి పురోగతే దీనికి కేంద్రంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధన కోసం బ్రిక్స్ సంస్కరణల రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని మోదీ ప్రతిపాదించారు. ప్రాతినిధ్యం, ప్రతిస్పందన, నియమ-నిర్మాణం అనే మూడు స్తంభాలపై ఈ రోడ్‌మ్యాప్ దృష్టి సారించాలని సూచించారు. ప్రాతినిధ్యం గురించి వివరిస్తూ, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్‌ఎస్‌సీ)లో సంస్కరణలను ఇకపై వాయిదా వేయరాదని, స్పష్టమైన కాలపరిమితితో కూడిన లక్ష్యాలతో చర్చలు జరగాలని ఆయన నొక్కిచెప్పారు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలలో ఓటింగ్ హక్కులు, నాయకత్వ పాత్రలు, విధాన ప్రాధాన్యతలను కూడా ప్రస్తుత ఆర్థిక వాస్తవాలకు అనుగుణంగా మార్చాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటిం చారు. గత 20 ఏళ్లలో బ్రిక్స్ కూటమి ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరు చుకుందని ప్రధాని మోదీ అన్నారు. సభ్య దేశాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నా యని తెలిపారు. "మేము ఎవరికీ వ్యతిరేకం కాదు. ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకు వెళ్లే విధానంతోనే పనిచేస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. భారత్ అధ్యక్షతన స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. ఈ అజెండాను సామాన్య ప్రజలతో అనుసంధానం చేసేందుకు దేశవ్యాప్తం గా దాదాపు 30 నగరాల్లో 350కి పైగా సమావేశాలు నిర్వహించినట్లు ఆయన వివరించారు.

## అర్జెంటీనాలో రాత్రికి రాత్రే వెనక్కి వెళ్లిన సముద్రం..

అర్జెంటీనాలో రాత్రికి రాత్రే సముద్రం ఎండిపోయిందంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వార్తలు తీవ్ర కలకలం రేపాయి. అయితే, ఇది అవాస్తవమని, ప్రకృతి వైపరీత్యం కాదని, కేవలం ఒక తాత్కాలిక సహజ ప్రక్రియ మాత్రమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

**అసలేం జరిగింది?**

అర్జెంటీనాలోని మార్ డెల్ ప్లాటా తీరంలో అట్లాంటిక్ మహాసముద్రం నీరు సుమారు 23 కిలోమీటర్ల మేర వెనక్కి తగ్గినట్టు వార్తలు వచ్చాయి. సముద్రం వెనక్కి తగ్గడం వల్ల, సాధారణంగా నీటిలో మునిగి ఉండే 'రెస్టింగా డెల్ ఫారో' అనే భారీ శిలా ప్రదేశం పూర్తిగా బయటపడింది. తీరంలో నిలిచిపోయిన పడవలు, వెనక్కి వెళ్ళిన సముద్ర గర్భం దృశ్యాలను చూసి స్థానికులు, పర్యాటకులు విస్మయానికి గురయ్యారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, సముద్రం ఎండిపోయిందనే తప్పుడు ప్రచారం జోరందుకుంది.

**నిపుణుల వివరణ**

అయితే, ఇది సునామీ హెచ్చరిక గానీ, సముద్రం శాశ్వతంగా ఎండిపోవడం గానీ కాదని నిపుణులు తేల్చిచెప్పారు. తీరం నుంచి సముద్రం వైపు బలమైన గాలులు వీయడం, అదే సమయంలో సముద్రపు పోటు తక్కువగా ఉండటం వల్ల నీరు తాత్కాలికంగా వెనక్కి వెళ్లిందని వివరించారు. కొన్ని గంటల వ్యవధిలోనే నీటిమట్టం తిరిగి సాధారణ స్థాయికి చేరుకుందని అర్జెంటీనా మీడియా వెల్లడించింది. సాధారణంగా భూకంపం సంభవించినప్పుడు నీరు వేగంగా వెనక్కి వెళ్లి, తిరిగి భారీ అలలతో విరుచుకుపడితే దానిని సునామీగా పరిగణిస్తారు. కానీ ఇక్కడ కేవలం వాతావరణ మార్పుల వల్లే నీరు వెనక్కి వెళ్లి, అనంతరం తిరిగి ప్రశాంతంగా యథాస్థితికి చేరుకుంది. కాబట్టి, సముద్రం అదృశ్యమైందంటూ వస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని నిపుణులు స్పష్టం చేశారు.

## బర్తరఫ్ తర్వాత కీలక పరిణామం.. కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు

ఆమెకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఢిల్లీకి రావాల్సిందిగా పిలుపు అందింది. వెంటనే బయలుదేరి రావాలని పార్టీ పెద్దల నుంచి ఆమెకు సందేశం అందినట్లు తెలుస్తోంది. మంత్రివర్గం నుంచి తొలగించిన మరుసటి రోజే హైకమాండ్ రంగంలోకి దిగడం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి రేపుతోంది. నిన్న తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, కొండా సురేఖతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలని, అధిష్ఠానం అండగా ఉంటుందని ఆమెకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ సంభాషణ జరిగిన కొద్ది గంటల్లోనే ఢిల్లీ నుంచి పిలుపు రావడం గమనార్హం. మంత్రి పదవి కోల్పోయి అసంతృప్తితో ఉన్న కొండా సురేఖను బుజ్జగించేందుకే అధిష్ఠానం ఈ చర్యలు చేపట్టినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆమెకు కేబినెట్ స్థాయి పదవిని అప్పగించే యోచనలో కాంగ్రెస్ పెద్దలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అధిష్ఠానం పిలుపు మేరకు కొండా సురేఖ ఢిల్లీ పర్యటన తర్వాత ఈ వ్యవహారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# సంపాదకీయం

## ప్రజాస్వామ్యం ఎన్నికలతో మాత్రమే నిలబడదు!



కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం విద్య, ఉపాధి, పరీక్షల పారదర్శకత, పరిపాలనా జవాబుదారీతనం వంటి అంశాలపై ప్రారంభమైన సామాజిక నిరసనగా ప్రచారంలోకి వచ్చింది. రాజ్యాంగపరంగా పరిశీలిస్తే-- ప్రజలకు ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే హక్కు ఆర్టికల్ 19(1)(a) కింద భావ ప్రకటనా స్వేచ్ఛలో భాగం. అలాగే ఆర్టికల్ 19(1)(b) శాంతియుత సమావేశాల హక్కును, ఆర్టికల్ 19(1)(c) సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కును గుర్తిస్తుంది. అయితే రాజ్యాంగం హక్కులతో పాటు బాధ్యతలను కూడా నిర్దేశిస్తుంది. శాంతియుత నిరసన రాజ్యాం గబద్ధమైన హక్కు. అయినా హింస, ప్రజా ఆస్తుల ధ్వంసం, ఇతరుల హక్కులకు భంగం కలిగించే చర్యలు రాజ్యాంగ రక్షణ పొందవు. అదే విధంగా, ప్రభుత్వం కూడా ప్రజా శాంతి పేరుతో ప్రతి నిరసనను అణచివేయలేదు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం, పౌరుల మధ్య సంబంధం శక్తి--ప్రయోగంపై కాకుండా రాజ్యాంగబద్ధమైన సంభాషణపై ఆధారపడాలి. విద్యా వ్యవస్థపై ప్రజలకు నమ్మకం లేకపోతే అది వ్యక్తిగత నష్టమే కాదు; రాజ్యాంగ పరిపాలనపై విశ్వాసాన్ని కూడా దెబ్బతీ స్తుంది. ప్రభుత్వం ఏ నిరసననైనా చట్టపరంగా నియంత్రించవచ్చు. కానీ ఆ నియంత్రణ అవసరమైనంత మాత్రమే ఉండాలి. సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో 'సముచితత్వం' అనే రాజ్యాంగ సూత్రాన్ని ప్రముఖంగా గుర్తించింది. బలప్రయోగం చివరి మార్గం కావాలి; మొదటి ప్రతిస్పందన కాదు. ఒకవేళ శాంతియుత నిరసనకారులపై అధిక బలప్రయోగం జరిగితే అది స్వతంత్ర న్యాయపరమైన పరిశీలనకు లోబడి ఉండాలి. అదే విధంగా, నిరసనకారులు కూడా చట్టాన్ని ఉల్లంఘిస్తే వారికి కూడా చట్టమే వర్తించాలి. న్యాయపాలన అంటే ప్రభుత్వం చట్టానికి లోబడి ఉండటమే కాదు, పౌరులు కూడా చట్టాన్ని గౌరవించడమే. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమాన్ని కేవలం ఒక రాజకీయ సంఘటనగా చూడటం సరికాదు. ఇది యువతలో పెరుగుతున్న ఆందోళనలు, ఉపాధి భద్రత, విద్యా న్యాయం, ప్రభుత్వ జవాబుదారీతనం, ప్రజాస్వామ్య భాగస్వామ్యం వంటి విస్తృత ప్రశ్నలను లేవనెత్తిన సామాజిక ప్రక్రియగా అధ్యయనం చేయవచ్చు. ఉద్యమం విజయవంతమైందా లేదా అన్నదాని కంటే, అది ప్రజాస్వామ్య చర్చను ఎంతవరకు విస్తరించింది అన్నదే రాజ్యాంగపరంగా ముఖ్యమైన ప్రమాణంపౌర హక్కుల దృక్పథంలో చూస్తే, ప్రభుత్వం ప్రజల శత్రువు కాదు; అలాగే ప్రజలు కూడా ప్రభుత్వ శత్రువులు కాదు. ప్రభుత్వం ప్రజలను భయపెట్టి పాలన చేయకూడదు. రాజ్యం ప్రజలపై హింసకు పాల్పడకూడదు. ప్రజలు శాంతియుత పద్ధతిలో ఉద్యమాలు చేస్తున్నప్పుడు ప్రభుత్వాలు వారిని శత్రువులుగా పరిగణించి హింసకు పాల్పడటం ప్రజాస్వామ్యం కాదు. ప్రభుత్వం విమర్శను వినాలి; ప్రజలు రాజ్యాంగ మార్గాన్ని అనుసరించాలి; న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించాలి; మీడియా వాస్తవాలను ధ్రువీకరించాలి. ఈ నాలుగు స్తంభాలు బలంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం జీవిస్తుంది. ఈ ఉద్యమం మనకు ఇచ్చిన అతిపెద్ద పాఠం ఏమిటంటే-- ప్రజాస్వామ్యం ఎన్నికలతో మాత్రమే నిలబడదు. ప్రజల అప్రమత్తత, రాజ్యాంగ విలువల పట్ల నిబద్ధత, ప్రభుత్వ జవాబుదారీతనం, పౌర హక్కుల పరిరక్షణ-- ఈ నాలుగు అంశాలు కలిసినప్పుడే ప్రజాస్వామ్యం సజీవంగా ఉంటుంది. రాజ్యాంగం అధికారాన్ని సృష్టించింది; కానీ ఆ అధికారానికి పరిమితులను కూడా విధించింది. ప్రజలకు హక్కులను ఇచ్చింది; అదే సమయంలో బాధ్యతలను కూడా గుర్తుచేసింది. ఈ సమతుల్యతను కాపాడటం ప్రతి పౌరుడి, ప్రతి ప్రభుత్వ సంస్థ రాజ్యాంగ విధి.

# జన జీవితాలలో కన్పించని జీడీపీ వృద్ధి




జనులు జీడీపీ అంకెలను భుజిస్తారా? అని ఒక విజ్ఞుడు ప్రశ్నించాడు. ఆ ప్రశ్న ఒక వ్యంగ్య ఛలోక్తి. నిజమే. ప్రజలు ఆహారాన్ని తింటారు, వస్త్రాలను ధరిస్తారు, పాదరక్షలు వేసుకుంటారు, తమ పిల్లలను బడికి పంపుతారు, వ్యాధుల నుంచి విముక్తికి ఔషధాలు కొనుక్కుంటారు, మొబైల్ ఫోన్స్ ఉపయోగిస్తారు. వీటితో పాటు టెలివిజన్ కార్యక్రమాలను వీక్షిస్తారు, సామాజిక మాధ్యమాల్లో పోస్టులను చదవడంలో నిమగ్నమవుతారు, భద్రమైన జీవనం, సంతోషదాయక జీవితాన్ని కోరుకుంటారు-- ఇవన్నీ వ్యక్తుల వినియోగాలు. ఈ మొత్తం వినియోగాల విలువ ఎంత? ప్రభుత్వం విధించే, ఇచ్చే రాయితీలను పరిగణనలోకి తీసుకున్న తరువాత వినియోగం (కన్సంప్షన్), మదుపు (ఇన్వెస్ట్‌మెంట్), ప్రభుత్వ వ్యయం (గవర్నమెంట్ స్పెండింగ్), నికర ఎగుమతులు (ఎక్స్--ఎమ్) మొత్తమే స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ). ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యాన్ని కొలవడానికి జీడీపీ వృద్ధిరేటు చాలా ముఖ్యం. 2026--27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి (ఏప్రిల్ నుంచి జూన్ వరకు) జీడీపీ అంకెలను గణాంకాల, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ ఇటీవల విడుదల చేసింది. 2025--26 ఆర్థిక సంవత్సర మొదటిత్రైమాసికంతో పోలిస్తే జీడీపీ వృద్ధిరేటు నామమాత్ర (ప్రస్తుత) ధరల ప్రకారం 10.3 శాతంగాను, స్థిర ధరల ప్రకారం 7.8 శాతంగాను నమోదయింది. ఈ గణాంకాల పట్ల ప్రభుత్వ ఆర్థికవేత్తలు ఎనలేని సంతృప్తి, ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. సంశయగ్రస్తులూ తక్కువేవీ కాదు. వీరు అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. జీడీపీ గణాంకాల విశ్వసనీయతపై ప్రస్తుతం ఒక తీవ్ర చర్చ నడుస్తోంది. ఫెడరల్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే 'ఒక దేశం, ఒకే ఎన్నిక' ప్రతిపాదనపై కంటే జీడీపీ అంకెలు, వాటి పెరుగుదల ప్రయోజనాలు ప్రజల జీవితాల్లో ప్రతిబింబిస్తున్నాయా అన్న విషయమై చర్చించడం మంచిది.

గణాంకాల, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ వెల్లడించిన జీడీపీ అంకెలు సరైనవని భావిద్దాం. రెండు భిన్న ఆధార సంవత్సరాల (బేస్ ఇయర్స్) ప్రాతిపదికన నామమాత్ర జీడీపీ, వాస్తవ జీడీపీ సంయుక్త వార్షిక వృద్ధిరేటు (కాంపౌండెడ్ యాన్యువల్ గ్రోత్ రేట్-- సీఏజీఆర్) ఇలా ఉంది: సంవత్సరం ఎదుట బ్రాకెట్‌లోని మొదటి సంఖ్య ప్రస్తుత ధరల ప్రకారం నామమాత్ర జీడీపీని, రెండో సంఖ్య స్థిర ధరల ప్రకారం వాస్తవ జీడీపీని లక్షల కోట్ల రూపాయల్లో సూచిస్తుందిఆర్థిక సంవత్సరం 2022--23: (268.90, 161.65); 2023--24: (301.23, 176.51); 2024--25: (330.68, 187.97); 2025--26: (357.14, 201.90). సీఏజీఆర్: నామమాత్ర జీడీపీకి 9.92శాతం; వాస్తవ జీడీపీకి 7.69శాతం.

ఆధార సంవత్సరం 2022--23 ప్రాతిపదికన జీడీపీ అంకెలు ఇలా ఉన్నాయి: ఆర్థిక సంవత్సరం 2022--23: (261.77, 261.77); 2023--24: (290.73, 280.94); 2024--25: (317.99, 301.15); 2025--26: (345.37, 324.70). సీఏజీఆర్: నామమాత్ర జీడీపీకి 9.68శాతం; వాస్తవ జీడీపీకి 7.45శాతం.

కొత్త ఆధార సంవత్సరం ప్రాతిపదికన 2026--27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో నామమాత్ర జీడీపీ 88.26 లక్షల కోట్లు కాగా వాస్తవ జీడీపీ 81.36 లక్షల కోట్లు.

2025--26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సర మొదటి త్రైమాసికంలో పెరుగుదల నామమాత్ర జీడీపీ 10.33శాతం, వాస్తవ జీడీపీ 7.82శాతం.

పరిగణనలోకి తీసుకున్న నాలుగు ఆర్థిక సంవత్సరాలకు గాను సీఏజీఆర్ పాత, కొత్త ఆధార సంవత్సరాల ప్రాతిపదికన ఇంచుమించు ఒకే విధంగా ఉండడం గమనార్హం. 2026--27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో వృద్ధిరేటు స్వల్పస్థాయిలో మాత్రమే అధికంగా ఉన్నది. దీన్నిబట్టి దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించి మనం ఎటువంటి అభిప్రాయానికి రావచ్చు? ఇదీ నా అభిప్రాయం: 2026--27లో భారత ఆర్థిక వ్యవస్థ దశ దిశ మారలేదు. దాని పురోగమనం వేగం పుంజుకోలేదు. మరి ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడానికి నిజంగా ఏమైనా ఉందా? ఏమీలేదు.

పాత ఆధార సంవత్సరం ధరల ప్రాతిపదికన అంచనాలలో స్థిర ధరల్లో జీడీపీ, నామమాత్ర ధరల్లో జీడీపీతో పోలిస్తే చాలా నిరుత్సాహకరంగా ఉన్నది. అయితే కొత్త ఆధారసంవత్సరం ధరల ప్రాతిపదికన అంచనాలలో అలా లేదు. ఎందుకని? ఆ వ్యత్యాసం చాలా చికాకుపరచడం లేదూ? అదలా ఉంచితే అంకెల్లో ఘనంగా ఉన్న జీడీపీ వృద్ధిరేటు సామాన్య ప్రజల జీవితాల్లో అంతే ఉజ్వలంగా ప్రతిబింబిస్తున్నదా? ఉద్యోగాల సృష్టి, వేతనాల పెరుగుదల, వినియోగం పరిమాణం, వ్యాపార వాణిజ్యాలు, పెట్టుబడులు మొదలైన విషయాలలో ఆ వృద్ధి ఎలా కనిపిస్తోంది? కొన్ని ప్రాసంగిక ప్రశ్నలు:

15 నుంచి 29 సంవత్సరాల వయసు యువజనులలో నిరుద్యోగిత రేటు అధిక స్థాయిలో 16.2శాతం మేరకు ఎందుకు ఉన్నది? 29 నుంచి 34 సంవత్సరాల వయసులో ఉన్న పట్టభద్రులలో నిరుద్యోగిత రేటు తరచూ 40 నుంచి 45శాతం దాకా ఉంటోంది. కారణమేమిటి? నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం-- 15 నుంచి 29 సంవత్సరాల వయసులో ఉన్న 8.7 కోట్ల మంది యువజనులు అటు ఉద్యోగంలో గానీ, ఇటు విద్యాభ్యాసం, వృత్తిపరమైన శిక్షణలో గానీ లేరు. ఎందుకని?; వాస్తవ వేతనాల పెరుగుదల చాలా నిరుత్సాహకరంగా ఉన్నది. రోజువారీ కూలీలు, వేతన ఉద్యోగులు, స్వయం ఉపాధి కార్మికులకు ఆ వాస్తవ వేతనాల పెరుగుదల వరుసగా (--) 5.5, 1.7, 3.3 శాతంగా మాత్రమే ఉంది. దేశ కార్మికశక్తిలో రోజువారీ కూలీలు 20శాతంగా ఉన్నారు. వాస్తవ వేతనాల పెరుగుదల అంత ప్రతికూలంగా ఉన్నప్పుడు కాయకష్టంపై బతుకుతున్న కోట్లాది శ్రామికుల జీవితాలలో పండుగలు ఎలా పరిమళిస్తాయి?

నికర ఎఫ్‌డీఐ (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు) చాలా తక్కువగా ఎందుకు ఉన్నాయి? ఎఫ్‌సీఎన్ఆర్ (ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్-- ప్రవాస భారతీయుల కోసం భారతదేశంలోని బ్యాంకుల్లో విదేశీ కరెన్సీలోనే డబ్బు దాచుకునే సౌలభ్యమున్న ఒక ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతా. ఈ డిపాజిట్లపై 6 నుంచి 7శాతం వడ్డీ ఇస్తారు) నిధులు పెద్ద ఎత్తున సమకూరుతుండగా విదేశీ పెట్టుబడులు ప్రత్యక్ష మదుపులుగా ఎందుకు రావడం లేదు?; మన విదేశీ మారకద్రవ్య నిల్వలు ఎన్నడూ లేని రీతిలో అత్యధికం (740 బిలియన్ డాలర్లు)గా ఉన్నాయి. అయినా రూపాయి విలువ ఎందుకు పెరగడం లేదు? ఈ ఏడాది జనవరి నుంచి డాలర్--రూపాయి మారకం రేటు దాదాపు 5శాతం మేరకు తగ్గిపోయింది. ఆసియా దేశాల కరెన్సీలలో కెల్లా రూపాయి విలువే చాలా అధమంగా ఉన్నది. ఎందుకని?

ఎగుమతులు పెరుగుతున్నాయి. దిగుమతులూ పెరుగుతున్నాయి. ప్రస్తుత ధరల వద్ద దిగుమతులు చాలా వేగంగా పెరుగుతున్నాయి. మన విదేశీ వాణిజ్యలోటు ఈ ఏడాది ఏప్రిల్--ఆగస్టులో 150 బిలియన్ డాలర్ల మేరకు ఉన్నది. చైనాతో వాణిజ్య లోటు ఈ ఏడాది ఏప్రిల్--జూలైలో 44 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ఈ వాణిజ్యలోటు దేశ ఆర్థిక వ్యవస్థకు పెనుభారంగా లేదూ? మేకిన్ ఇండియా, పీఎల్ఐ, ఎన్‌ఎమ్‌సీపీ మొదలైన పథకాలు మన తయారీరంగాన్ని ఎందుకు మెరుగుపరచడం లేదు? చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులను దేశంలోనే ఉత్పత్తి చేసుకునే సామర్థ్యాన్ని ఎందుకు సమకూర్చడం లేదు?

తయారీరంగం నామినల్ జీవీఏ (నామమాత్ర స్థూల విలువ జోడింపు-- ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేయకుండా ప్రస్తుత మార్కెట్ ధరల వద్ద ఒక ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి అయిన వస్తు సేవల మొత్తం విలువను లెక్కగట్టే కొలమానం) 13శాతం వద్దే ఎందుకు స్తంభించిపోయింది? ప్రభుత్వ పథకాలు ఈ పరిస్థితిని ఎందుకు చక్కదిద్దలేకపోతున్నాయి?

గ్రాస్ ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఫార్మేషన్ (జీఎఫ్‌సీఎఫ్-- స్థూల స్థిర మూలధన నిర్మాణం-- ఒక ఆర్థిక వ్యవస్థలో వ్యాపార సంస్థలు, ప్రభుత్వాలు సంపాదించిన, నిర్మించిన స్థిర ఆస్తుల నికర విలువను కొలుస్తుంది) జీడీపీలో 33.5శాతంగా మాత్రమే ఎందుకు ఉండిపోతోంది? ఈ జీఎఫ్‌సీఎఫ్‌లో ప్రైవేట్ కార్పొరేట్ మూలధన వ్యయం ఎంతకూ 12శాతంగా మాత్రమే ఉంటోంది. కార్పొరేట్ మదుపుదారులు మూలధన పెట్టుబడులు ఎందుకు పెట్టడం లేదు?; పెరిగిన జీడీపీ వృద్ధిరేటు మెరుగైన పాఠశాలలు, ఆస్పత్రులు, రహదారులు, మంచినీటి సరఫరా, పోలీసు సేవలకు ఎందుకు దోహదం చేయడం లేదు? ఈ సదుపాయాల విషయంలో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారనేది ఒక కఠోర వాస్తవం కాదూ?

ఎటుచూసినా నిరుత్సాహకర పరిస్థితులే. మరి జెన్‌జీ యువజనులు నిరసనలు తెలుపడంలో ఆశ్చర్యమేముంది? మంచి భవిష్యత్తు సమకూరగలదనే ఆశాభావాన్ని వారిలో దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు ఎంతమాత్రమూ పాదుకొల్పడం లేదు. గణాంకాల ప్రకారం మన ఆర్థిక వ్యవస్థ 7.8శాతం వృద్ధిరేటుతో పురోగమిస్తుండవచ్చు, కానీ అత్యధిక ప్రజలు ఆ విషయాన్ని అనుభవపూర్వకంగా నమ్మడం లేదు. పాలకులు ఏమి చెబుతున్నప్పటికీ తమ జీవన ప్రమాణాలు గతంలో కంటే మెరుగ్గా లేవన్న నిజం మాత్రమే వారికి తెలుసు.

వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 13 సెప్టెంబర్ 2026

# డి కొట్టాలలో ఘనంగా ముగిసిన తితిదే కార్యక్రమాలు





కర్నూలు సెప్టెంబర్12 వార్త సాక్ష్యం

తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో రుద్రవరం మండలం, డి. కొట్టాల గ్రామంలోని శ్రీ రామాలయం నందు గత ఐదురోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమంలో అత్యంత భక్తి శ్రద్ధలతో ముగిశాయి. ప్రతిరోజు స్థానిక భజన మండలి చే భజనలు, ఇస్కాన్ ధర్మ ప్రచారకులు శ్రీశ్రీ నిత్యతృప్తదాస్ స్వామీజీచే శ్రీమద్రామాయణము, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరిం చాయి. సమాజంలో భక్తిచింతన పెరిగినప్పుడే సమాజం సుఖ సంతోషాలతో వర్ధిల్లుతుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. అర్చకులు సత్యనారా యణశర్మ భక్తులందరితో గోవును సర్వాంగ సుందరంగా అలంకరించి, సామూహిక కుంకుమా ర్చనలు గోపూజ కార్యక్రమాన్ని నిర్వహింప చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి బ్రహ్మానందరెడ్డి, నరసింహారెడ్డి, చిన్న సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, రాముడు, కృష్ణ, నాగరాజు, మల్లికార్జున్, దస్తగిరిరెడ్డి తోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అంగన్వాడి పిల్లలకు ఆరోగ్య పోషకాలతోనే పౌష్టిక ఆహారం

-చరక కాలనీలో అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులకు, బాలింతలకు, అవగాహన

-అంగన్వాడి కార్యకర్త షరీఫా



ఆత్మకూరు సెప్టెంబర్12 వార్త సాక్ష్యం

తల్లి బిడ్డలు ఆరోగ్యంతో జీవించాలంటే పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని చరక కాలనీ అంగన్వాడీ కార్యకర్త షరీఫా పేర్కొన్నారు. శనివారం చరక కాలనీలో అంగన్వాడి కేంద్రంలో గర్భవతులు, బాలింతలకు పోషకాహార విలువలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అంగన్వాడీ కార్యకర్త మాట్లాడుతూ ఇంట్లో దొరికే మునగాకు బచ్చలాకు వంటి ఆకుకూ రల్లో పుష్కలమైన పోషకాలు ఉంటాయని బాలింతలు గర్భవతులు సరైన మోతాదులో పోషకాహారాలు తీసుకుంటే తమ బిడ్డల ఆరోగ్యంతో పాటు తమ ఆరోగ్య పరిస్థితి వృద్ధాప్యం వరకు నిలకడగా ఉంటుందని తెలిపారు. ప్రధానంగా మునగాకులో లభించే కాల్షియం విటమిన్ ఈ విటమిన్ సి వంటి అత్యంత శక్తివంతమైన పోషకాలు తీసుకోవడం వల్ల జీర్ణశక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారని వివరించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వల ఆదేశాల మేరకు స్త్రీ, శిశు సంక్షేమ లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఆయా, గర్భవతులు, బాలింతలు అంగన్వాడి పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల పట్టణంలోబుల్లెట్‌పై జిల్లాఎస్పీ ఆకస్మిక పర్యటన





-నంద్యాలలో విజిబుల్ పోలీసింగ్‌పై ఆరా.

-పోలీసుల పనితీరుపై పరిశీలన

నంద్యాల సెప్టెంబర్ 12 వార్త సాక్ష్యం

నంద్యాల పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు పోలీసుల అందుబాటు,విజిబుల్ పోలీసింగ్ అమలును స్వయంగా పరిశీలించేందుకు జిల్లా ఎస్పీ సునీల్ షోరన్ ఆకస్మికంగా రంగంలోకి దిగారు. శనివారం బుల్లెట్ వాహనంపై పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఎస్పీ నేరుగా రహదారులపైకి రావడంతో పోలీసు సిబ్బంది అప్రమత్తమయ్యారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరన్‌తో పాటు నంద్యాల ఏఎస్పీ సుస్మిత రామనాథన్ పర్యటనలో .ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, సున్నిత ప్రాంతాల్లో పోలీసుల గస్తీ,బందోబస్తు,ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను వారు పరిశీలించారు. ప్రజలకు పోలీసుల ఉనికి స్పష్టంగా కనిపించేలా నిరంతరం గస్తీ నిర్వహించాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది పట్టణంలో నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ కీలకమని ఎస్పీ పేర్కొన్నట్లు సమాచారం. ముఖ్యంగా రాత్రి వేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేయడం,అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెంచడం, సమస్యాత్మక ప్రాంతా లను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించడం వంటి అంశాలపై పోలీసు అధికారులతో ఆయన చర్చించారు.ప్రజలకు ఏ సమయంలోనైనా పోలీసులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని,చిన్న సమస్యను సైతం నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో స్పందించాలని సిబ్బందికి సూచించారు. ప్రధాన రహదారులు,కూడళ్లలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీసుల విధులు ఉండాలని ఆదేశం చినట్లు సమాచారం ఎస్పీ ఆకస్మిక పర్యటనతో పట్టణ పోలీసు యంత్రాంగంలో కదలిక వచ్చింది. క్షేత్రస్థా యిలో పోలీసులు నిర్వహి స్తున్న విధులు,గస్తీ వ్యవస్థ ఎలా ఉందన్న విషయాన్ని స్వయంగా పరిశీలించడమే లక్ష్యంగా ఎస్పీ పర్యటన సాగినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.ఇకపై కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని,విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవనే సంకేతాన్ని ఎస్పీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

# ఆత్మకూరు నుండి కొక్కిరంచకు ఆర్టీసీ బస్సును రాత్రి 8 గంటలకు కొనసాగించాలి

-ప్రజా సంఘాలు, డిమాండ్



ఆత్మకూరు సెప్టెంబర్ 12 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం,మాల మహానాడు నాయకులు పాతకోట రమేష్, నాగరత్నం మరియు గ్రామ ప్రజలు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ ఆర్ కె. కిషోర్ కు ఆత్మకూరు నుండి కొక్కెరంచ గ్రామానికి గతంలో కొన సాగుతున్నది. ప్రస్తుతం ఆ బస్సును రద్దు చేయడం జరిగింది. ఉదయం నుంచి చదువుకు నే విద్యార్థులు రైతులు ప్రజలు తమ అవసరాల కోసం నిత్యం ఆత్మకూరు వస్తూ ఉంటారు. మరి తిరుగు ప్రయాణంలో సాయంత్రం ఐదు గంటల కె ఆర్టీసీ బస్సును బందు చేయడంతో చదువుకునే 8 9 10 వ తరగతి చదువుకునే , విద్యార్థిని విద్యార్థులు , మరి రైతులు, తీవ్రమైన ఇబ్బందికి గురవుతున్నారని, తెలిపారు వెంటనే రాత్రి 8 గంటలకు ఆర్టీసీ బస్సును కొనసాగించాలని, అట్లాగే శ్రీశైలానికి బస్సులు లేక ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారని శ్రీశైలానికి అదనంగా బస్సులు నడపాలని, నంద్యాల సర్వీసులు కూడా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని నాలుగు సర్వీసు బస్సులను అధికంగా కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని వారన్నారు. అనంతరం ఆర్ ఆర్ కె కిషోర్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో ప్రజా సంఘా ల నాయకులు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, మాల మహానాడు పాలమరి రమేష్,, నాగ రత్నం, బలరాం, పాల్గొన్నారు వెంటనే సమస్యను పరిష్కరించేందుకు. ఆర్టీసీ ఈడీ స్పందిస్తూ ఆర్టీసీ బస్సులను పెంచే దానికి హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు.

# కార్మిక కర్షకుల ఆశాజ్యోతి కామ్రేడ్ సీతారాం ఏచూరికి నివాళి :సిపిఎం




ఆత్మకూరు సెప్టెంబర్ 12 వార్త సాక్ష్యం

కార్మిక కర్షకుల ఆశాజ్యోతి కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఏ.రాజశేఖర్, మండల కార్యదర్శి సుధాకర్ లు అన్నారు. శనివారం పట్టణంలోని సిపిఎం పార్టీ అఖిలభారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సభ పట్టణంలోని డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్ నందు జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వర్ధంతి సభలో వారు మాట్లాడుతూ దేశం ఒక గొప్ప మేధావిని కోల్పోయిందని అన్నారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం కార్మిక వర్గానికి రైతాంగానికి దేశ ప్రజలకు, వామపక్ష ప్రజాతంత్ర శక్తులకు తీరని లోటుఅని అన్నారు విద్యార్థి దశ నుండి అంచలంచలుగా ఎదిగి మూడుసార్లు సిపియం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై రాజ్యాంగాన్ని రక్షించేందుకు మత రాజకీయాలను వ్యతిరేకిస్తూ లౌకికవాద స్ఫూర్తిని కొనసాగిస్తూ దేశ రాజకీయాల్లో, ప్రపంచ రాజకీయాలలోచెరగని ముద్ర వేశారని అన్నారు. నడుస్తూ నడిపించారునిజమైన ప్రజానేతగా నిలిచారు. మీ రూపం మా ఎదురుగా లేకపోయినామీ మాటలు, మీరందించిన స్ఫూర్తి నిత్యం వెంటాడుతాయిమీ ఆశయాల బాటలోనడిచేందుకుదారిచూపుతాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ నాయకులు రామ్ నాయక్, స్వాములు, సి. వెంకటేశ్వర్లు, సద్దాం, కిరణ్, మూర్తుజా, నూర్, నబి, రవి, గణపతి, సామెలు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

-రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌పెదిరెడ్డి చిట్టిబాబు

-పేటలో హైమా నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



పాయకరావుపేట సెప్టెంబర్ 12 వార్త సాక్ష్యం

శ్రీ గణేష్ నవరాత్రి మహోత్సవాలలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు అంతా కృషి చేయాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు పిలుపునిచ్చారు. 14 తేదీన జరగనున్న వినాయక చవితి పర్వదినశీ సందర్భంగా పట్టణంలోని హైమా నేత్రాలయం ఆధ్వర్యంలో ఆస్పత్రి ప్రాంగణంలో శనివారం చేపట్టిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు భక్తులకు ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది సహా ప్రజా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

# చెకుముకి సైన్స్ పోటీల్లో మెరిసిన మినర్వా విద్యార్థులు





ప్రత్తిపాడు సెప్టెంబర్ 12 వార్త సాక్ష్యం

ప్రత్తిపాడులో జ్ఞాన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలు-2026లో మినర్వా విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.జూనియర్ విభాగంలో ఎలుగుబంటి షణ్ముఖ కృష్ణ , మరియు మట్టపర్తి గీతిక సాయి ద్వితీయ స్థానం సాధించారు.ఈ సందర్భంగా విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి వి రాజబాబు, మినర్వా విద్యా సంస్థల చైర్మన్ ముత్యాల మురళీకృష్ణ అభినందించారు. చెకుముకి సైన్స్ సంబరాల్లో ద్వితీయ స్థానం సాధించడం పాఠశాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు గర్వకారణమని పేర్కొన్నారు.విజేతలకు,వారికి విద్య నేర్పిన ఉపాధ్యాయులకు చైర్మన్ ముత్యాల మురళీకృష్ణ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపల్ లక్ష్మణకుమార్, హెడ్మాస్టర్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## హమారా ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి,

**– అంబేద్కర్ మహిళ సంఘం అధ్యక్షురాలు రజని,**



**అమలాపురం సెప్టెంబర్ 12 వార్త సాక్ష్యం**

అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం హై స్కూల్ సెంటర్ నుండి గడియారస్తంభం సెంటర్‌వరకు మాతా రమాబాయి అంబేద్కర్ మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్లో హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాతా రమాబాయి అంబేద్కర్ మహిళ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు పుణ్యమంతుల రజని మాటా ్లడుతూ భారత రాజ్యాంగం నిర్మాత, ప్రపంచ మేధావి అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు, రచనలు చేస్తే సహించేది లేదన్నారు. 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని నిషేధించాలని ఆమె కోరారు.. భారత రాజ్యాంగ నిర్మాత మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు, చేసిన హమారా ప్రసాద్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.లేని పక్షంలో భారీ ఎత్తున ఉద్యమం ఉధృతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం లో మాతా రమాబాయి అంబేద్కర్ మహిళ సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ లో 582 కేసుల రాజీ



**తాడేపల్లి గూడెం సెప్టెంబర్ 12 వార్త సాక్ష్యం**

రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం న్యాయస్థానాల సముదా యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాల త్‌లో మొత్తం 582 కేసులు రాజీ అయ్యాయి. ఇంచార్జి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 11 వ అదనపు జిల్లా జడ్జి సుంకర శ్రీదేవి ఆధ్వర్యం లో జరిగిన కార్యక్రమంలో 21 సివిల్, 122 క్రిమినల్, 24 ప్రీ-లిటిగేషన్, 415 బెంచ్ కోర్టు కేసులను ఇరువర్గాల అంగీకారంతో పరిష్కరించా రు. బెంచ్ మెంబర్లుగా సీనియర్ సివిల్ జడ్జి కె. మాధవి, 1 వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. లలితాదేవి, లాయర్లు కంకట శ్రీనివాసరావు, మూత సౌదామిని వ్యవహరించగా, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె. అప్పిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు అడ్వకేట్లు, కక్షిదారులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## పశ్చిమ గోదావరి జిల్లాలో మాతృ, శిశు మరణాలపై వైద్య ఆరోగ్యశాఖ అధికారి సమీక్ష సమావేశం

**-జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ సి.హెచ్.వి. భారత లక్ష్మి...**



**పాలకోడేరు సెప్టెంబర్ 12 వార్త సాక్ష్యం**

పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ సి.హెచ్.వి. భారత లక్ష్మి ఆధ్వర్యంలో జిల్లాలో మాతృ మరణాలు మరియు శిశు మరణాలపై సబ్ కమిటీ అంతర్గత సమీక్ష సమావేశం నిర్వహించారు. 2026 సంవత్సరం జూన్ నుండి ఆగస్టు వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్సీ)పరిధిలోని గ్రామాల్లో జరిగిన మరణాలపై ఈ సమావేశంలో సమగ్రంగా విశ్లేషించారు. సమీక్ష వివరాల ప్రకారం వెంకటరామన్నగూడెం, పాలకోడేరు, మార్టేరు, రేలంగి, అత్తిలి, పోడూరు, పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మొత్తం7 శిశు మరణాలు (0-5 సంవత్సరాలు), అలాగే అత్తిలి పరిధిలో 1 మాతృ మరణం సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మరణాలకు దారితీసినఖచ్చితమైన కారణాలపై సంబంధిత వైద్యాధికారులు, సూపర్వై జర్లు,ఎం. ఎల్.హెచ్. పి.లు, ఏ.ఎన్.ఎం.లు, ఆశా కార్యకర్తలు మరియు అంగన్వాడీ కార్యకర్తలతో జిల్లా అధికారులు సుదీర్ఘంగా చర్చించి సమీక్ష జరిపారు. భవిష్యత్తులో ఇటువంటి మరణాలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రసవ సమయాల్లో అనుసరిం చాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు.

# కొలనుభారతి ఆలయ అభివృద్ధిపై సమీక్షా సమావేశం








**-నందికొట్కూరు శాసనసభ్యులు గిత్తా జయసూర్య ఆధ్వర్యంలో సమావేశం**
**-శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు,**
**-ధర్మకర్తల మండలి సభ్యులు డాక్టర్ చిట్టిబొట్ల భరద్వాజశర్మ, మేడా మురళీధర్**
**-కాకనూరు స్వామి శ్రీశ్రీశ్రీ శివ యోగేంద్ర సరస్వతీ స్వామి**
**-శివపురం గ్రామపెద్దలు ఎర్రం చంద్రశేఖర్, లింగస్వామి గౌడ్**

**శ్రీశైలం సెప్టెంబర్ 12 వార్త సాక్ష్యం**

శ్రీశైల దేవస్థాన దత్తత దేవాలయమైన కొలను భారతీక్షేత్రంలో సమీక్షా సమావేశం శనివారం నంది కొట్కూరు శాసనసభ్యులు గిత్తా జయసూర్య ఆధ్వర్యంలో ఈ సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సమీక్షా సమావేశంలో నందికొట్కూరు శాసన సభ్యులు ఆలయ అభివృద్ధికి వనరులు, ఆలయానికి రాబడి, అభివృద్ధికి దాతల సహకారం, భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన, రవాణా సౌకర్యాలపై మాట్లాడారు. నల్లమల అడవుల్లో పవిత్ర క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీశైలదేవస్థానం కొలనుభారతీ ఆలయాన్ని దత్తత తీసుకోవడంతోనే ఆలయానికి మహర్దశ పట్టిందని అన్నారు. ఈ క్షేత్రంలో కైంకర్యాలను సక్రమంగా సజావుగా జరిగేలా అందరూ చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారులతో కలిసి సమస్యలను పరిష్కరి ంచుకోవాలని దేవస్థానం అధికారులకు సూచించారు. అటవీ మార్గంలో ఉన్నందున ఉదయం, సాయంత్రం వేళల్లో రాకపోకలు, విద్యుద్దీకరణకు సహకరి ంచాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. సరస్వతీ అమ్మవారి ఆలయంలో వేదపండితులతో కైంకర్యాలను జరిపించడం తన చిరకాల వాంఛ అన్నారు. నిత్యం దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్యను నమోదు చేస్తామని, ఆలయ అభివృద్ధికి అందరు కృషి చేయాలని కోరారు. భవిష్యత్తులో దశలవారీగా ఆలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తామన్నారు. ఇకమీదట తరుచుగా ఆలయ అభివృద్ధిపై సమీక్షా సమావేశాలను నిర్వహిస్తామన్నారు. ఆలయం వద్ద వేదపండితులకు, అర్చకస్వాములకు శాశ్వతంగా రెండు గదులు నిర్మించడానికి తగు చర్యలు చేపట్టుతా మన్నారు. అనంతరం శ్రీశైలదేవస్థాన కార్యనిర్వ హణాధికారి యం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆల యంలో సమయపాలన చాలా ముఖ్యమని అన్నారు. ప్రతీరోజు ఉదయం 6 గంటలకు ఆలయశుద్ధి కార్యక్రమాలు ప్రారంభించి ఆయా సమాయాలలో పరిపూర్ణంగా ఆలయసేవలను జరపాలని సిబ్బందిని ఆదేశించారు. ఆలయంలో ఉచిత దర్శనాన్ని కల్పిస్తు న్నామన్నారు. ఆర్జితసేవలకు మాత్రం నామమాత్రపు రుసుమును వసూలు చేస్తున్నట్లుగా చెప్పారు. భక్తులకు రక్షితత్రాగునీరు కోసం ఆర్.ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామనీ, అక్షరాభ్యాసం చేయు మండపాన్ని కూడా అభివృద్ధి చేస్తామని అన్నారు. విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి విద్యుద్దీకరణ మెరుగుప రుస్తామన్నారు. సిబ్బందికి గుర్తింపు కార్డులను అందజేస్తామన్నారు. సిబ్బంది విధుల నిర్వహణ సమ యంలో సంప్రదాయవస్త్రాలతో ఉండాలన్నారు. ప్రతీరోజు ఉద్యోగుల హాజరును పర్యవేక్షణ చేస్తామని, వారంలో రెండు రోజులు దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి వారి పర్యవేక్షణ ఉంటుం దన్నారు. క్షేత్రానికి విచ్చేసే ప్రముఖుల అభిప్రా యాలను రిజిస్టరు నందు నమోదు చేయించి, వారి సలహాలు సూచనలు తీసుకుంటామన్నారు. భక్తులు సమర్పించే కానుకలను క్రమం తప్పకుండా ఆలయ ఖాతాలో జమ చేయడం జరుగుతోందన్నారు. అసం పూర్ణంగా మిలిగిన ఆలయ మండప పనులను సిజిఎఫ్ నిధులతో పూర్తి చేస్తామని తెలిపారు. శివపురం గ్రామం సమీపంలో ముఖద్వారం నిర్మిం చడానికి చర్యలు చేపట్టుతామన్నారు. అమ్మవారి ఆలయంలో శాశ్వత క్యూలైన్లు ఏర్పాటు చేస్తామ న్నారు. అనుబంధ ఆలయాలలో కూడా శాశ్వత క్యూలైన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శాశ్వత శౌచాలయాలు, ఓవర్‌హెడ్ ట్యాంకు, మంచినీటిసరఫరా కోసం బోర్‌బావి ఏర్పాటు చేయ డానికి చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్రమంతటా అమ్మవారి దివ్యనామం వినిపించే విధంగా సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా ఉత్సవాల సమయంలో అవసరం మేరకు అత్యున్నత నాణ్యతతో కూడిన సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వీటన్నింటిని ధర్మకర్తల మండలి సమావేశంలో అజెండా అంశాలుగా ప్రవేశపెట్టి కూలంకుషంగా చర్చించడం జరుగుతుందన్నారు. ఆలయం ఖాతాలో ఉన్న ఫిక్సిడ్ డిపాజిట్లు, మిగిలిన నిలువ ధనం అలాగే ఉందనీ, ఇక్కడి ఉద్యోగులకు జీతాలు కూడా శ్రీశైలదేవస్థానమే చెల్లిస్తుందన్నారు. అనంతరం సమావేశంలో కాకనూరు స్వామి శ్రీశ్రీశ్రీ శివ యోగేంద్ర సరస్వతీ స్వామివారు మాట్లాడుతూ కొలనుభారతి విశిష్ట క్షేత్రమని, ఇక్కడ సప్తఋషులు తపస్సు చేశారని పేర్కొన్నారు. ఇక్కడ శ్రీశ్రీశ్రీ సరస్వతీ నారాయణ స్వాములవారు ఎంతో సేవ చేశారన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, అందరూ అమ్మ సేవకులేననీ తెలిపారు. అమ్మవారి సేవాభాగ్యం అందడం జన్మ జన్మల పుణ్యం అని అన్నారు. ఈ ఆలయంలో సమయపాలన ఉండాలన్నారు. తాత్కాలిక ఏర్పాటు కాకుండా, శాశ్వత ప్రతిపాదికన భక్తులకు సౌకర్యాలు ఉండాలన్నారు. ఆలయానికి కుంభాభిషేకం జరగా లనీ, వైదికధర్మంగా కైంకర్యాలను జరిపిం చాలని కోరారు. దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు డా. చిట్టిబొట్ల భరద్వాజశర్మ, మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి పాటుపడతామనీ, దత్తత తీసుకున్న కొద్ది సమయంలో వచ్చిన వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించామన్నారు. శివపురం గ్రామప్రజ లందరూ కలిసి దేవస్థానం అభివృద్ధికి పాటుపడా లన్నారు. యజ్ఞాలు - యాగాలు జరిగే చోట ఎటువంటి దీర్ఘకాలిక రోగాలూ ఉండవన్నారు. దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, మేడా మురళీధర్ మాట్లాడుతూ ఆలయానికి ప్రతీరోజు భక్తులు పెద్దసంఖ్యలో సందర్శించాలన్నారు. ఆలయ విశిష్టతను అందరికీ తెలియజేయాలని చెప్పారు. అనంతరం ఫారెస్ట్ అధికారి స్వరూప్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనలను అనుస రించి ఆలయ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ఈ సమావేశంలో మండల తాసిల్దార్ ఉమారాణి ఆత్మకూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్ రెడ్డి, కొత్తపల్లి ఎస్ఐ జయ శేఖర్ గౌడ్ పలువురు దేవస్థానం అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖ కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక వేత్త గోళ్ళ రాజేష్ ఆద్వర్యంలో 3,వేలమట్టి









**-పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజిద్దాం**
**-టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్,గోళ్ళ రాజేష్,**
**-మార్కెట్ యార్డు చైర్మన్ గుంటు పల్లి హరిబాబు, తాతిరెడ్డి మనీష్.**
**-ఘనంగా ఉచిత మట్టి గణపతుల పంపిణీ**

**నంద్యాల సెప్టెంబర్ 12 వార్త సాక్ష్యం**

పట్టణంలోని కల్పన సెంటర్ మార్కెట్ యార్డ్ ల ప్రధాన కూడళ్లలో నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త సామాజికవేత్త గొల్ల రాజేష్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షిస్తూ మరోవైపు భక్తి,శ్రద్ధలతో గణనాధుని పూజించుకుని తరించేలా వినాయక చవితి పండుగను పర్యావరణహితంగా జరుపు కోవాలని, ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే ప్రతిష్టించి పూజించాలనే ప్రధాన ఉద్దేశంతో మూడువేల మట్టి విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు డైరెక్టర్ సీనియర్ న్యాయవాది పార్టీ రెడ్డి తులసి రెడ్డి, తాతి రెడ్డి మనీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో గోళ్ళ రాజేష్ తో పాటు ముఖ్య అతిథులు పాల్గొన్న ప్రముఖులు కేంద్ర రాష్ట్రాల పిలుపు మేరకు పర్యా వరణ పరిరక్షణ కొరకై ప్రతి ఒక్కరు కూడా ప్లాస్టర్ ఆఫ్ పారిస్తో చేసినటువంటి విగ్రహాలకు బదులు మట్టి విగ్రహాలను ప్రతి ఒక్కరు పూజించాలని ప్రస్తుత పరిస్థితులలో వాతావరణం అనుకూలించక వర్షాపా తం లేక సరైన రీతిలో చెరువులలో నీటి లభ్యత కొరతవల్ల సరైన విద్యుత్తు కూడా అందిం చేందుకు అంతరాయం ఏర్పడుతుందని పద్యంలో ప్రతి ఒక్కరు కూడా మట్టి విగ్రహాలను పూజిద్దాం. ఆ విగ్రహాలను ఇంట్లోనే నిమర్జనం చేసే విధంగా ప్రయత్నించాలని పపిలుపు నిచ్చారు. ఈ కార్యక్ర మంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, అనుపూరి ఈశ్వర్, నూర్ భాషా, మనీష్ రెడ్డి, గోవింద నాయుడు, మురళి, దీపక్ రెడ్డి, అశోక్, ఉప్పరి సురేష్, బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్తా, స్వామి నాయక్, రాజా, ప్రహ్లాద్ మరియు స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొని మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించారు

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 13 సెప్టెంబర్ 2026

# సీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో 'జీరో టు హీరో' కార్యక్రమం

-హెమూడేళ్లలో లక్ష్యం.. నైపుణ్యాలు..
ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి
-ఉద్యోగానికి సిద్ధమైన పట్టభద్రుడిగా బయటకు రావాలి డా. సీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో 'జీరో టు హీరో' కార్యక్రమం...

భీమవరం సెప్టెంబర్ 12 వార్త సాక్ష్యం

డిగ్రీలో చేరిన విద్యార్థి మూడేళ్ల తర్వాత కేవలం పట్టాతో బయటకు రాకుండా స్పష్టమైన లక్ష్యం,అవసరమైన నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, ఉద్యోగ సంసిద్ధతతో బయటకు రావాల్సిన అవసరం ఉందని ప్రముఖ రచయిత, విద్యా పరివర్తన శిక్షకులు ప్రొఫెసర్ డా. కె.వి. సుబ్బరాజు అన్నారు. విద్యార్థులు ప్రథమ సంవత్సరం నుంచే తమ భవిష్యత్తుపై స్పష్టమైన అవగాహన ఏర్పరచుకుని, లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో భీమవరంలోని డా.సీఎస్ ఎన్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం సెప్టెంబరు 11న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 'జీరో టు హీరో ఏదిగే మనస్తత్వం, స్మార్ట్ లక్ష్య సాధన' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.కళాశాల ఏసీ సెమినార్ హాలులో జరిగే ఈ కార్యక్రమం తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో వరస్పర సంభాషణ పద్ధతిలో కొనసాగనుంది. విద్యార్థులు తమ జీవిత, విద్య, ఉద్యోగ లక్ష్యాలను స్పష్టమైన స్మార్ట్ లక్ష్యాలుగా ఎలా మార్చుకోవాలి, వాటిని సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటి, ప్రస్తుతం తమలో ఉన్న నైపుణ్యాలకు భవిష్యత్తులో అవసరమయ్యే నైపుణ్యాల మధ్య ఉ న్న లోటును ఎలా గుర్తించాలి, ఆ లోటును కళాశాల మూడేళ్లలో ఎలా అధిగమించాలి అనే అంశాలపై కార్యక్రమంలో అవగాహన కల్పించనున్నారు. 'జీరో స్మార్ట్ లక్ష్యం ఎదిగే మనస్తత్వంనిరంతర కృషి




హీరో అనే భావనతో కార్యక్రమాన్ని రూపొందించారు. కేవలం ప్రేరణాత్మక ప్రసంగానికే పరిమితం కాకుండా విద్యార్థులను నేరుగా భాగస్వాములను చేస్తూ 'చేస్తూ నేర్చుకునే' విధానంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. విద్యార్థులు స్వయంగా లక్ష్యాలను నిర్దేశించుకోవడంతో పాటు తమ నైపుణ్య లోటును గుర్తించి, రాబోయే మూడేళ్లలో లక్ష్యాన్ని చేరుకోవడానికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికను రూపొం దించనున్నారు. ఈ కార్యక్రమం డా. కె.వి. సుబ్బరాజు రచిస్తున్న 'ఎదిగే మనస్తత్వానికి 5 రహస్యాలు' అనే తెలుగు పుస్తకంలోని ముఖ్య భావనల ఆధారంగా రూపొందించారు. ఈ పుస్తకం అక్టోబరు 2026లో విడుదల కానుంది. ప్రొఫెసర్ డా. కె.వి. సుబ్బరాజు ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజినీరింగ్ కళాశాల, భీమవరం, జి.ఆర్.ఐ.ఇ.టి., హైదరాబాద్ సంస్థల్లో సుమారు నాలుగు దశాబ్దాల పాటు అధ్యాప కులుగా సేవలందించారు. 1995లోనే విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం పర్సనాలిటీ డెవలప్మెంట్ సెల్ను ఏర్పాటు చేసి వివిధ శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఏడు విభిన్న రంగాల్లో విద్యాభ్యాసం చేసిన ఆయన హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో అభ్యసనానికి సంబంధించిన ప్రత్యేక శిక్షణ పొందారు. దేశంలోని ఏడు రాష్ట్రాలతో పాటు అమెరికాలో 200కు పైగా విద్యాసంస్థలు, సంస్థల్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల ద్వారా నాలుగు లక్షలకు పైగా విద్యార్థులను ప్రభావితం చేశారు. విద్యార్థి వికాసం, వ్యక్తిత్వ వికాసం, మానవీయ విలువలపై ఆయన పది పుస్తకాలను రచించారు. వీటిలో పలు పుస్తకాలు విశ్వవిద్యా లయా లు, కళాశాలల్లో పాఠ్యపుస్తకాలు, శిక్షణ పుస్తకాలు, సహాయక గ్రంథాలుగా ఉపయోగించ బడుతున్నాయి. అమెరికాలోని డల్లాస్ సంక్రాంతి సంబరాల్లో యువతను ఉద్దేశించి ప్రసంగించేందుకు కూడా ఆయన ఆహ్వానం అందుకున్నారు. ఈ కార్యక్రమాన్ని స్మార్ట్ స్టూడెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

# జాతీయ లోక్ అదాలత్ లో 421 కేసులు రాజీ

భీమవరం సెప్టెంబర్ 12 వార్త సాక్ష్యం

రాష్ట్ర మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈ సంవత్సరపు మూడవ జాతీయ లోక్ అదాలత్ ను మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో పెండింగ్ మరియు ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కారం నిమిత్తం భీమవరంలో వున్న అన్ని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించారు. ఏ కోర్టు కేసులు ఆ కోర్టులోనే పరిష్కరించుకునేలా మొత్తం 5 బెంచ్ లను ఏర్పాటు చేసారు. 3వ అదనపు జిల్లా కోర్టు కేసులను పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి మరియు సంస్థ చైర్మన్ "డా".బి లక్ష్మీనారాయణ పరిష్కరించారు. సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు కేసులు మరియు ప్రీ లిటిగేషన్ కేసులను ఆ కోర్టు న్యాయమూర్తి ఎం.సుధారాణి రాజీ చేసారు.ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు కేసులను ఆ కోర్టు న్యాయమూర్తి జ. రమ్య పరిష్కరించారు. 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు కేసులను ఆ కోర్టు న్యాయమూర్తి పి. హనీష పరిష్కరించారు. అదేవిధంగా 2వ అదనపు జుడీషియల్




మొదటి తరగతి మేజిస్ట్రేట్ కేసులను ఆ కోర్టు న్యాయమూర్తి ఎన్. జ్యోతి రాజీ చేసారు.పై లోక్ అదాలత్ బెంచ్ లకు న్యాయవాది సభ్యునిగా కల్పన, జోసఫ్, సుబ్బారాయుడు, రామ్మూర్తి (సాయి) మల్లేశ్వరరావు పాల్గొని కేసుల రాజీకి కృషి చేసారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు హాజరై జాతీయ లోక్ అదాలత్ ను జయప్రదం చేసారు.ఈ రోజు జాతీయ లోక్ అదాలత్ లో సివిల్ కేసులు 33, క్రిమినల్ కేసులు 355, బ్యాంకు, BSNL మొండి బాకీ కేసులు 33 మొత్తం 421 కేసులు రాజీ చేసారు. సుమారు మూడు కోట్ల యాభై అయిదు లక్షల రూపాయల విలువైన కేసులు రాజీ చేసి కక్షిదారులకు ఇప్పించారు.

# డాక్టర్ అంబేద్కర్ చరిత్రను వక్రీకరిస్తున్న హమారా ప్రసాద్ ను కఠినంగా శిక్షించాలి

-హమారా ప్రసాద్ వ్యాఖ్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి,.

అమలాపురం సెప్టెంబర్ 12 వార్త సాక్ష్యం



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని. అవమానపరుస్తూ ఆయన యొక్క ఘనమైన చరిత్రను వక్రీకరిస్తూ సామాజిక మాధ్యమాలలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ అసత్యాలతో డాక్టర్ అంబేద్కర్ గారి పై విషం కక్కుతూ రచించిన కల్పిత నాయకుడు పుస్తకాన్ని నిషేధించి రెండు తెలుగు రాష్ట్రాల మరియు కేంద్ర ప్రభుత్వాలు హమారా ప్రసాద్ వ్యాఖ్యలపై స్పందించి అతనిపై దేశద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ జిల్లా దళిత సంఘాల జేఏసీ పిలుపుమేరకు శనివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్లో దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి అనంతరం పట్టణ పోలీసు స్టేషన్లో హమారా ప్రసాద్ ను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్నీ డాక్టర్ అంబేద్కర్ను కీర్తిస్తూ ప్రపంచ విజ్ఞాన నాయకుడిగా గౌరవిస్తుంటే మనదేశంలో కొంతమంది హమారా ప్రసాద్ లాంటి మనువాద మూర్ఖులు డాక్టర్ అంబేద్కర్ చరిత్రను వక్రీకరిస్తూ ఆయన రాసిన రాజ్యాంగాన్ని అవమాన పరుస్తున్నారని తప్పుడు వాక్యాలు చేస్తూ ఆయనను కించపరిచేలా అసత్యాలతో కూడిన ఒక పుస్తకాన్ని రచించడం వెనక ఆర్ఎస్ఎస్ బజరంగ్దళ్ విశ్వహిందూ పరిషత్ లాంటి మతోన్మాద శక్తులు హమారా ప్రసాద్ లాంటి సంఘవిద్రోహులకు అండగా ఉండి నడిపిస్తున్నారని ఆరోపించారు, డాక్టర్ అంబేద్కర్ దళితులకు మాత్రమే రాజ్యాంగం రాయలేదని దేశంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పిస్తూ రాజ్యాంగం రచించారని ఆయన సేవలను గుర్తిస్తూ భారతదేశం భారతరత్న ప్రకటించిందని గుర్తు చేశారు ప్రపంచ దేశాలన్నిటిలో ఘనమైన చరిత్ర గలిగిన డాక్టర్ అంబేద్కర్ గారిని మనదేశంలో ఉన్న హిందూ మతోన్మాద శక్తులు కించపరచడం వెనుక ఆంతర్యం ఏమిటని ఆయన రాసిన రాజ్యాంగానికి లోబడి పని చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హమారా ప్రసాద్ అంబేద్కర్ పై అత్యంత దారుణంగా మాట్లాడుతుంటే స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంఘవిద్రోహి అయిన హమారా ప్రసాద్ పై దేశద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అసత్యాలతో హమారా ప్రసాద్ రచించిన కల్పిత నాయకుడు పుస్తకాన్ని పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా హమారా ప్రసాద్ ను అరెస్టు చేసేంతవరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో భారత రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డీబీ లోక్. దళిత ఐక్యవేదిక కన్వీన జంగా బాబురావు. కో కన్వీనర్ రేవు తిరుపతిరావు. మాల మహానాడు రాష్ట్ర నాయకులు పెయ్యల పరశు రాముడు. జల్లి శ్రీనివాసరావు .గూటం సాయి. మాకే సిద్దు , రొక్కాల నాగేశ్వరరావు మెండు దుర్గాప్రసాద్. గెద్దాడ బుద్ధ రాజ్. నాగవరపు అన్నవరం .పరమట సింగ్ చిట్టిబాబు. నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# పేటలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

-మురుగునీటిలోనే దుకాణదారుల అవస్థలు



చిలకలూరిపేట సెప్టెంబర్ 12 వార్త సాక్ష్యం

చిలకలూరిపేట పట్టణంలోని మార్కెట్ యార్డ్ ముందున్న సర్వీస్ రోడ్డులో డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా తయారైంది. సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో, కొద్దిపాటి వర్షానికే మురుగునీరు, వర్షపు నీరు ఏకమై రోడ్లపైనే నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నాయి. ఇక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, అటుగా వెళ్లే కార్ల టైర్లు పూర్తిగా మునిగిపోయే స్థాయికి రోడ్లపై నీరు చేరుకుంటోంది. తమ దుకాణాల ముందు రోజుల తరబడి ఈ మురుగునీరు నిలిచిపోతుండటంతో రాకపోకలకు, వ్యాపారాలకు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా, దుర్వాసనతో రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానిక దుకాణదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి ఈ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు, ఎస్ఈ బి. రాజేశ్వరి,

అమలాపురం సెప్టెంబర్ 12 వార్త సాక్ష్యం




వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని డా బి ఆర్జి అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని గణేష్ మండపాలకు ఉచితంగా తాత్కా లిక విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్నట్లు జిల్లా ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి. రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు సెప్టెంబరు 14 నుంచి 22 వరకు ఈ ఉచిత విద్యుత్ సదుపాయం అందుబాటులో ఉంటుందని ఆమె పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లోని మండపాలకు కిలోవాట్లు (3 కె డబ్ల్యూ.), పట్టణ ప్రాంతాల్లోని మండపాలకు 5 కిలోవాట్ కె డబ్ల్యూ వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు. ఉత్సవ నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ కోరారు. ఆసక్తి గల మండపాల నిర్వాహకులు తమ దరఖాస్తులను పూర్తి చేసి, స్థానిక విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లకు అందజేయాలని సూచించారు. దరఖాస్తు అందిన వెంటనే విద్యుత్ సిబ్బంది నేరుగా మండపాల వద్దకు వచ్చి ఉచితంగా సర్వీస్ లైను వేసి, మీటరు బిగిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియకు నిర్వాహకులు ఎవరికీ ఎలాంటి డబ్బులు చెల్లించవలసిన అవసరం లేదని శ్రీమతి రాజేశ్వరి స్పష్టం చేశారు.

# పేదరికం జయించి బ్యాంకు కొలువు సాధించిన దుర్గ భవాని

-జాతీయ బ్యాంక్ ఉద్యోగం సాధించిన దుర్గాభవానీను ఘనంగా సన్మానించిన కాపు బలిజ సంఘ నాయకులు.



దేవరపల్లి సెప్టెంబర్ 12 వార్త సాక్ష్యం

దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామానికి చెందిన ఆరేటి దుర్గా భవాని సెంట్రల్ బ్యాంక్ అఫ్ ఇండియాలో క్రెడిట్ ఆఫీసర్ గా ఎంపికై రాజమహేంద్రవరంలో ఉద్యోగ నియామకం పొందారు.ఎంతో కష్టపడి ఉన్నత లక్ష్యం సాధించిన దుర్గా భవానీ యువతకు ఆదర్శమని చదువుకు పేదరికం అడ్డురాదని నిరూపించిందని కాపు బలిజ సంక్షేమసంఘ నాయకులు నరహరిశెట్టి దొరబాబు పుట్టా వరప్రసాద్ అన్నారు.సంఘ నాయకులు దుర్గా భవానీను ఘనంగా సత్కరించి మెమెంటో అందించారు.తనకు బ్యాంకింగ్ రంగం అంటే ఇష్టమని అందుకోసం నిరంతరం కష్టపడి చదివి విజయం సాధించానని తన కుటుంబ సభ్యులప్రోత్సాహం మరువలేనిదని యువత లక్ష్యసాధన దిశగా పయనిస్తే విజయం సాధ్యమని దుర్గాభవనీ అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బళ్ళ సత్యనారాయణ తిరుమలశెట్టి సీతా రామరాజు బళ్ళ బాబులు పోతుల బలరామకృష్ణ పులపా దానయ్య పుట్టా కాశీ విశ్వనాథ్ పుట్టా పోసిబాబు నూకల కరుణాకర్ పుట్టా గంగాధర్ యండపల్లి రాఘవ గంట్రోతు పోసిబాబు పుట్టా సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 13 సెప్టెంబర్ 2026

# బిజినెస్

## నామినీ ఉండగా మళ్లీ వీలునామా ఎందుకు? తప్పక తెలుసుకోవాల్సిన తేడా ఇదే!



"బ్యాంకు ఖాతాలో నామినీగా భార్య పేరు ఉంది. మరి వీలునామా ఎందుకు?". "పెట్టుబడులన్నింటికీ నామినీని పెట్టేశాం. ఇక ఆస్తుల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదా?" చాలా కుటుంబాల్లో ఇలాంటి సందేహాలు ఉంటాయి. బ్యాంకు ఖాతా తెరిచినా, జీవిత బీమా తీసుకున్నా, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టినా ముందుగా అడిగేది నామినీ వివరాలే. పేరు రాసి, సంతకం చేసి చాలామంది ఆ విషయాన్ని అక్కడితో వదిలేస్తారు. కానీ నామినీని నమోదు చేయడం ఒక్కటే ఆస్తుల పంపకానికి సరిపోతుందా? లేదు. నామినేషన్, వీలునామా రెండూ ఒకటే కాదు. రెండింటి ఉద్దేశం వేరు. ఈ తేడా తెలియకపోతే కుటుంబంలో తర్వాత అనవసరమైన వివాదాలు తలెత్తే అవకాశం ఉంటుంది.

**-నామినీ అంటే ఎవరు?**

సులభంగా చెప్పాలంటే.. ఖాతాదారు చనిపోయిన తర్వాత బ్యాంకు, బీమా సంస్థ లేదా మ్యూచువల్ ఫండ్ సంస్థ మొదట సంప్రదించే వ్యక్తి నామినీ. క్లెయిమ్ ప్రక్రియ సులభంగా పూర్తయ్యేలా నామినీ వివరాలు ఉపయోగపడతాయి. ఉదాహరణకు.. ఒక వ్యక్తి బ్యాంకు ఖాతాలో తన భార్యను నామినీగా పెట్టారనుకుందాం. ఆయన మరణించిన తర్వాత బ్యాంకుతో జరిగే ప్రక్రియలో భార్యకు డబ్బు అందే అవకాశం ఉంటుంది. దీనివల్ల కుటుంబం క్లెయిమ్ కోసం తిరగాల్సిన ప్రక్రియ కొంత సులభమవుతుంది. అయితే డబ్బు అందుకోవడం ఒక విషయం.. ఆ డబ్బుపై తుది హక్కు కలిగి ఉండటం మరో విషయం. కొన్ని సందర్భాల్లో నామినీ ఆ మొత్తాన్ని చట్టబద్ధ వారసులకు అందించాల్సిన వ్యక్తిగా మాత్రమే ఉంటారు. తుది హక్కు వారసత్వ చట్టాలు లేదా చెల్లుబాటు అయ్యే వీలునామా ఆధారంగా నిర్ణయమవుతుంది.

## ఎర్ర సముద్రంలో ఉద్రిక్తత.. భారత్‌కు డబుల్ టెన్షన్!



యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్రంలో కీలక ప్రాంతాలపై పట్టు సాధిస్తుండటం భారత్‌కు కొత్త ఆందోళన కలిగిస్తోంది. వ్యూహాత్మకమైన మోఖా పోర్టును స్వాధీనం చేసుకున్న హౌతీలు, ప్రపంచ వాణిజ్యంలో కీలకమైన బాబ్ ఎల్-మండెబ్ జలసంధి వైపు వేగంగా దూసుకెళ్తున్నారు. ఇప్పటికే హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, ఈ తాజా పరిణామం భారత్‌కు "డబుల్ చోక్ పాయింట్" ప్రమాదాన్ని తెచ్చిపెడుతోంది. ఇది దేశ ఇంధన భద్రత, వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది."గేట్ ఆఫ్ టియర్స్"గా పిలిచే బాబ్ ఎల్-మండెబ్ జలసంధి, ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో కలుపుతుంది. సూయజ్ కెనాల్ ద్వారా ఆసియా-యూరప్ మధ్య జరిగే వాణిజ్యానికి ఇదే ప్రధాన మార్గం. జూన్ 2026 నాటి గణాంకాల ప్రకారం, ఈ మార్గం గుండా రోజుకు సుమారు 7.4 మిలియన్ బ్యారెళ్ల పెట్రోలియం రవాణా అవుతోంది. సౌదీ అరేబియా కూడా తన చమురు ఎగుమతుల్లో అధిక భాగాన్ని ఈ మార్గంలోనే మళ్లించింది.ఈ పరిణామాల ప్రభావం భారత్‌పై చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కెప్లర్ డేటా ప్రకారం, భారత్ దిగుమతి చేసుకునే మొత్తం ముడిచమురులో 50 శాతానికి పైగా ఇదే మార్గం గుండా వస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రష్యా, సౌదీ అరేబియా నుంచి వచ్చే చమురు రవాణాపై ఇది నేరుగా ప్రభావం చూపుతుంది. హౌతీలు ఈ జలసంధిపై నియంత్రణ సాధిస్తే, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడంతో పాటు, రవాణా, బీమా ఖర్చులు కూడా భారీగా పెరుగుతాయి.ఇది కేవలం దిగుమ తులకే పరిమితం కాదు. భారత్ నుంచి యూరప్‌కు వెళ్లే ఇంజనీరింగ్ వస్తువులు, ఫార్మా, టెక్స్‌టైల్స్ వంటి ఎగుమతులపైనా ప్రభావం పడుతుంది. ప్రత్యామ్నా యంగా ఆఫ్రికా చుట్టూ కేప్ ఆఫ్ గుడ్ హోప్ మార్గంలో వెళ్లాలంటే ప్రయాణ సమయం, ఖర్చులు రెండూ పెరుగుతాయి. ఒకవైపు హర్మూజ్, మరోవైపు బాబ్ ఎల్-మండెబ్ వద్ద ఉద్రిక్తతలు పెరగడం భారత్ శక్తి భద్రత, ఆర్థిక వ్యవస్థకు తీవ్ర సవాల్‌గా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## యువతే లక్ష్యంగా విజయ్ కొత్త వ్యాపారం.. అందుబాటు ధరలో స్కిన్‌కేర్ ఉత్పత్తులు



టాలీవుడ్ ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ తన వ్యాపార ప్రస్థానంలో మరో ముందడుగు వేశాడు. నటనతో పాటు వ్యాపార రంగంలోనూ తనదైన ముద్ర వేస్తున్న ఆయన, తాజాగా స్కిన్‌కేర్ రంగంలోకి ప్రవేశించాడు. 'అన్‌హైప్' పేరుతో ఒక కొత్త స్కిన్‌కేర్ బ్రాండ్‌కు సహ వ్యవస్థాపకుడిగా వ్యవహరిస్తున్నాడు. 18 నుంచి 30 ఏళ్ల యువతను లక్ష్యంగా చేసుకుని, అనవసరపు హంగులు లేకుండా సరళమైన, సైన్స్ ఆధారిత ఉత్పత్తులను అందుబాటు ధరల్లో అందించడమే ఈ బ్రాండ్ ముఖ్య ఉద్దేశం.ఈ బ్రాండ్ రూపకల్పనలో విజయ్ కేవలం ప్రచారకర్తగా కాకుండా, భాగస్వామిగానూ పాలుపంచుకున్నాడు. ఏడాది క్రితం ప్రారంభమైన ఈ ప్రయాణంలో, ఉత్పత్తుల నాణ్యతను నిర్ధారించుకునేందుకు దాదాపు 9 నెలల పాటు ప్రతి వెర్షన్‌ను తన చర్మంపై స్వయంగా పరీక్షించుకున్నానని చెప్పాడు. "చాలా కాలంగా అభిమానులు నా స్కిన్‌కేర్ గురించి అడుగుతున్నారు. వారికి సరైన సమాధానం ఇవ్వాలనుకున్నాను. అందుకే ఎలాంటి హైప్ లేకుండా, నిజంగా పనిచేసే ఉత్పత్తులను తీసుకురావాలని నిర్ణయించుకున్నా" అని విజయ్ వివరించారు. "No BS. Only what works" అనేది ఈ బ్రాండ్ ట్యాగ్‌లైన్. ప్రారంభ దశలో 'వీడీ సిగ్నేచర్ రొటీన్స్' పేరుతో రెండు రకాల ఉత్పత్తులను విడుదల చేస్తున్నారు. ప్రతి రొటీన్‌లో ఫేస్ వాష్, మాయిశ్చ రైజర్, సన్‌స్క్రీన్ ఉంటాయి. మొటిమలు, జిడ్డు చర్మం కోసం 'యాక్నే సేఫ్ రొటీన్', ట్యాన్ తొలగించి చర్మాన్ని ప్రకాశవంతంగా మార్చేందుకు 'బ్రైటెనింగ్ రొటీన్' అందుబాటులో ఉంటాయి. భారతీయ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రూపొం దించిన ఈ ఉత్పత్తుల ధరను ఒక్కో రొటీన్‌కు రూ. 1,299గా నిర్ణయించారు.

## బుమ్రాను ఎదుర్కొనేందుకు మా వద్ద వ్యూహాలు ఉన్నాయి: ఆఫ్ఘన్ కెప్టెన్ జద్రాన్




గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి వస్తున్న టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను ఎదుర్కోవడానికి తమ వద్ద ప్రత్యేక వ్యూహాలున్నాయని ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్ ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం (సెప్టెంబరు 13) అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగనున్న తొలి టీ20కి ముందు జద్రాన్ మీడియాతో మాట్లాడాడు. బుమ్రా రాకతో భారత బౌలింగ్ విభాగం పటిష్ఠంగా మారినప్పటికీ, అతడిని సమర్థంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశాడు. "జస్ప్రీత్ బుమ్రా ప్రపంచంలోని అత్యుత్తమ బౌలర్లలో ఒకడు. నాకు ఇష్టమైన ఫాస్ట్ బౌలర్ కూడా అతడే. అయితే మేం ఏ విషయాన్నీ క్లిష్టంగా మార్చుకోం. అతడి కోసం మా వద్ద మంచి ప్రణాళిక ఉంది. అతడి బౌలింగ్‌ను ఎలా ఎదుర్కోవాలనే దానిపై స్పష్టమైన అవగాహనతో ఉన్నాం. బుమ్రాతో పాటు భారత జట్టుపైనా మెరుగైన ప్రదర్శన చేస్తామని ఆశిస్తున్నాం" అని జద్రాన్ తెలిపాడు.టీమిండియా యువ సంచలనం, లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించామని జద్రాన్ వెల్లడించాడు. "ఐపీఎల్‌లో అతడిని ఎదుర్కొన్న మా జట్టు ఆటగాళ్ల నుంచి కీలక సమాచారం సేకరించాం. ఇప్పటికే అతడి వీడియోలను విశ్లేషించాం. సరైన సమయంలో సరైన ప్రణాళికలను అమలు చేయడంపైనే మా దృష్టి ఉంది" అని వివరించాడు.భారత్‌లో ఆడటం తమకు కొత్తేమీ కాదని, ఇక్కడి పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉందని జద్రాన్ అన్నాడు. "గతంలో టీ20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్‌లతో పాటు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడాం. 2024లో బెంగళూరులో జరిగిన టీ20లో రెండు సూపర్ ఓవర్ల వరకు మ్యాచ్ సాగింది. భారత్‌పై మేం ఎప్పుడూ మెరుగైన క్రికెట్ ఆడాం. అయితే ఇప్పటివరకు వారిపై సిరీస్ గెలవలేదు. ఈసారి ఆ రికార్డును బద్దలు కొట్టి సిరీస్ గెలవడమే మా లక్ష్యం" అని పేర్కొన్నాడు.రషీద్ ఖాన్ నుంచి టీ20 కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించడంపై మాట్లాడుతూ, తమ మధ్య మంచి అవగాహన ఉందని, ఇది జట్టుకు మేలు చేస్తుందని తెలిపాడు. కొత్త కోచ్ రిచర్డ్ పైబస్ మార్గదర్శకత్వంలో జట్టు మరింత మెరుగవుతోందని, గతంలో తాము బలహీ నంగా ఉన్న అంశాలపై దృష్టి సారించి మెరుగు పరుచుకుంటున్నామని వివరించాడు. భారత గడ్డపై వారికే ఆతిథ్యమివ్వడం తమ క్రికెట్ చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం అని జద్రాన్ అభివర్ణించాడు. కెప్టెన్‌గా ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి, సరైన సమ యంలో సరైన నిర్ణయాలు ఎలా తీసుకోవాలనే దానిపై దృష్టి పెడుతున్నానని, ఈ కొత్త బాధ్యతను ఆస్వాది స్తున్నానని అన్నాడు.

## 15 ఏళ్ల నాటి వివాదం- సచిన్ ఔట్‌పై పాక్ మాజీ స్పిన్నర్ సంచలన ఆరోపణ



పాకిస్థాన్ మాజీ స్పిన్నర్ సయీద్ అజ్మల్ మరోసారి పాత వివాదాన్ని తెరపైకి తెచ్చాడు. 2011 ప్రపంచకప్ సెమీఫైనల్‌లో సచిన్ టెండూల్కర్‌ను అవుట్ చేసే విషయంలో డెసిషన్ రివ్యూ సిస్టమ్ (డీఆర్ఎస్)ను తారుమారు చేశారని ఆయన సంచలన ఆరోపణలు చేశాడు. తాజాగా ఒక వీడియోలో ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. 2011 మార్చి 30న మొహాలీ వేదికగా భారత్, పాకిస్థాన్ మధ్య వరల్డ్ కప్ సెమీఫైనల్ జరిగింది. ఈ మ్యాచ్‌లో సచిన్ 23 పరుగుల వద్ద ఉన్నప్పుడు అజ్మల్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా అంపైర్ ఇయాన్ గౌల్డ్ అవుట్ ఇచ్చాడు. అయితే, గౌతమ్ గంభీర్‌తో చర్చించిన అనంతరం సచిన్ రివ్యూ కోరాడు. బాల్ ట్రాకింగ్‌లో బంతి లెగ్ స్టంప్‌ను మిస్ అవుతున్నట్లు తేలడంతో థర్డ్ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న సచిన్, 115 బంతుల్లో 85 పరుగులు చేసి భారత విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఆ మ్యాచ్‌లో భారత్ 29 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్‌కు చేరింది. ఈ ఘటనను గుర్తుచేసు కుంటూ అజ్మల్ ఇటీవల మాట్లాడుతూ, "అంపైర్ అవుట్ ఇచ్చాడు. గంభీర్ సూచనతో సచిన్ రివ్యూ తీసుకున్నాడు. ఇప్పటికీ నేను నమ్ముతున్నాను.. డీఆర్ఎస్ చివరి ఫ్రేమ్‌ను మార్చేశారు" అని వ్యాఖ్యానించాడు.అజ్మల్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇది కేవలం కుట్ర సిద్ధాంతమని, కంప్యూటర్ ఆధారిత బాల్ ట్రాకింగ్‌ను మార్చడం అసాధ్యమని పలువురు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అజ్మల్ గతంలో నూ అనేకసార్లు ఇదే విధమైన ఆరోపణలు చేయడం గమనార్హం.

# స్పోర్ట్స్

## అరంగేట్రంలోనే రికార్డు మోత.. పాక్ ఆటగాడు రజావుల్లాకు ఇంగ్లీష్ ప్రేక్షకులు స్టాండింగ్ ఓవేషన్.



క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మ్యాచ్ ప్రతి ఆటగాడికి చిరస్మరణీయం. కానీ, పాకిస్థాన్‌కు చెందిన 21 ఏళ్ల యువ పేసర్ రజావుల్లా తన తొలి టెస్టును ఎప్పటికీ మరిచిపోలేని విధంగా మలుచుకున్నాడు. బౌలర్‌గా జట్టులోకి వచ్చి, బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఆఖరి టెస్టులో ఓటమి అంచున నిలిచిన పాకిస్థాన్‌ను తన అద్భుత ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. కేవలం 63 బంతుల్లో 9 సిక్సర్లు, 81 పరుగులతో ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ ప్రదర్శనకు ఎడ్జ్‌బాస్టన్ స్టేడియం మొత్తం నిలబడి చప్పట్లతో (స్టాండింగ్ ఓవేషన్) అభినందించింది. మూడో రోజు ఆటలో పాకిస్థాన్ ఇన్నింగ్స్ ఓటమి దిశగా సాగుతున్నప్పుడు రజావుల్లా 9వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జోష్ టంగ్ వంటి ఇంగ్లండ్ మేటి పేస్ బౌలర్లను ఏమాత్రం భయపడకుండా ఎదుర్కొన్నాడు. ముఖ్యంగా పాక్ టాప్ ఆర్డర్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టిన షార్ట్ బంతులనే లక్ష్యంగా చేసుకుని భారీ షాట్లు ఆడాడు. ఈ క్రమంలో కేవలం 43 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. టెస్టు అరంగేట్రంలో పాకిస్థాన్ తరఫున అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ ఇదే కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో మహమ్మద్ అబ్బాస్ (42)తో కలిసి రజావుల్లా 121 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ ఇద్దరి పోరాటంతో పాకిస్థాన్ 449 పరుగుల స్కోరు చేసింది.

# వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' టీజర్ నవ్వులతో మొదలై థ్రిల్లింగ్ మలుపు!







తెలుగు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కాంబినేషన్లలో విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌లది ఒకటి. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నెం: 47 / AK 47) సినిమా నుంచి అభిమానులకు అదిరిపోయే ట్రీట్ వచ్చింది. తాజాగా విడుదలైన ఈ చిత్రం టీజర్, అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతూ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది.టీజర్ ఆరంభం నుంచి త్రివిక్రమ్ మార్క్ స్పష్టంగా కనిపించింది. సరికొత్త లుక్‌లో కనిపించిన వెంకటేశ్, తనదైన కామెడీ టైమింగ్, డైలాగ్ డెలివరీతో కట్టిపడేశారు. "డబ్బు సబ్బు లాంటిది రా, చేతులు కడుక్కోవడానికే పనికొస్తుంది", కుటుంబం అప్పుల లెక్కలు చెప్పే సన్నివేశాలు, వంటింట్లో జరిగే సంభాషణలు ప్రేక్షకుల పెదాలపై నవ్వులు పూయించాయి. మధ్యతరగతి కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను వినోదాత్మకంగా చూపిస్తూనే, కథలో కీలక మలుపును పరిచయం చేశారు. కుటుంబమంతా కలిసి 'AK 47' అనే పేరున్న ఓ డ్యూప్లెక్స్ ఇంట్లోకి మారడంతో కథ మరో స్థాయికి వెళుతుంది. అంతా సంతోషంగా సాగుతున్న సమయంలో ఓ క్రైమ్ సంఘటన జరగడం, విలన్ ఎంట్రీతో టీజర్ ఒక్కసారిగా సీరియస్ టర్న్ తీసుకుంటుంది. దీంతో ఈ సినిమా కేవలం కుటుంబ కథ మాత్రమే కాదని, ఇందులో థ్రిల్లింగ్ అంశాలు కూడా ఉన్నాయని స్పష్టమవుతోంది. కామెడీ, ఎమోషన్స్, సస్పెన్స్‌తో కూడిన ఒక సంపూర్ణ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను త్రివిక్రమ్ సిద్ధం చేసినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. ఈ చిత్రంలో వెంకటేశ్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. నారా రోహిత్, దివ్యేందు శర్మ, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిశోర్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో భాగమయ్యారు. తమన్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు అదనపు ఆకర్షణగా నిలిచింది. నిర్మాతలు ఈ చిత్రాన్ని గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విడుదలైన కొద్ది గంటల్లోనే విశేష స్పందన రాబట్టుకున్న ఈ టీజర్, సినిమాపై ఉన్న అంచనాలను తారాస్థాయికి చేర్చింది.

## 'మహేంద్రగిరి వారాహి' - మూవీ రివ్యూ!

ఈ మధ్య కాలంలో దైవశక్తిని తోడుగా చేసుకుని తెరపైకి వస్తున్న కథలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ తరహా సినిమాలకు ఆడియన్స్ ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు కూడా. అలా వారాహీదేవి చుట్టూ తిరిగే ఒక కథగా వచ్చిన సినిమానే 'మహేంద్రగిరి వారాహి'. సుమంత్ హీరోగా సంతోష్ జాగర్లపూడి తెరకెక్కించిన సినిమా ఇది. సిద్ధూ జొన్నలగడ్డ .. ఐశ్వర్య రాజేశ్ కనిపించిన ఈ సినిమా, ఈ నెల 11వ తేదీన విడుదలైంది. అది 'మహేంద్రగిరి' అనే ఒక విలేజ్. మహేంద్ర భూపతికి సంబంధించిన రాజవంశీకులు జమీందారులుగా ఆ గ్రామంలో నివసిస్తూ ఉంటారు. ఆ వంశానికి వారాహీదేవి శాపం ఉంటుంది. 33 ఏళ్లు నిండగానే ఆ వంశానికి సంబంధించిన వారసులు చనిపోతారనేదే ఆ శాపం. ఆ రోజున రాజేంద్రవర్మ ( సిద్ధూ జొన్నలగడ్డ) 33వ జన్మదినం. దాంతో రాజేంద్ర వర్మ భార్య సుజాత .. ఆయన నాయనమ్మ శకుంతల ( మంజుభార్గవి) ఆందోళన చెందుతుంటారు. అంతలో సుజాతకి నొప్పులు మొదలు కావడంతో, ఆమెను పట్నం తీసుకెళ్లడానికి బయల్దేరిన రాజేంద్రవర్మ చనిపోతాడు. అందుకు వారాహీదేవి కారణమని చెప్పుకుంటారు.రాజేంద్రవర్మ చనిపోవడం .. నిండు గర్భవతి అయిన సుజాత కనిపించకుండా పోవడం శకుంతలను కుంగదీస్తాయి. ఆ సమయంలో కూతురు పురుడు పోసుకోవడం ఆమెకి కాస్త ఊరటను కలిగిస్తుంది. శకుంతల ఆ బిడ్డకు నరేంద్రవర్మ అని నామకరణం చేసి పెంచుతుంది. 'ప్రీతి' అనే అమ్మాయిని నరేంద్రవర్మ ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు. దాంతో తమ వంశానికి వారాహీదేవి ఇచ్చిన శాపం గురించి ప్రీతితో శకుంతల చెబుతుంది. తన తాతయ్య విశ్వనాథ శాస్త్రి ( సురేశ్) తమను ఈ గండం నుంచి బయటపడేయగలడని ప్రీతి ధైర్యం చెబుతుంది



# రచ్చ లేపడానికి రెడీ.. ఒక్క పోస్టుతో 'స్వయంభూ'పై అంచనాలు పెంచేసిన నిఖిల్




యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడిక్ చిత్రం 'స్వయంభూ'పై అంచనాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై నిఖిల్ తాజాగా ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ పంచుకున్నారు. ఒకే సినిమా కోసం 175 రోజులు షూటింగ్ చేయడం, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉండటం తన కెరీర్‌లో ఇదే తొలిసారని ఆయన తెలిపారు. మంచి ప్రయత్నాలకు సమయం పడుతుందని, త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు నిఖిల్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ""స్వయంభూ' ఒక పాన్ ఇండియా చిత్రంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మంచి పనులకు సమయం పడుతుంది. మేము దాదాపు ఆ దశకు చేరుకున్నాం. ఒకే సినిమా కోసం 175 రోజులు షూట్ చేస్తానని, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉంటాయని నేను ఎప్పుడూ ఊహించలేదు. కానీ... రచ్చ లేపడానికి రెడీ. త్వరలోనే విడుదల తేదీ ప్రకటన ఉంటుంది" అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది. ఇటీవల హీరోయిన్ సంయుక్త పుట్టినరోజు సందర్భంగా, ఆమె పోషిస్తున్న 'భూమి' పాత్రకు సంబంధించిన ఒక బీటీఎస్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో యాక్షన్ సన్నివేశాల కోసం ఆమె పడిన కష్టం స్పష్టంగా కనిపించింది. ఈ సినిమా కోసం సంయుక్త ఎంతో ధైర్యంగా ఒక ప్రమాదకరమైన స్టంట్ చేశారని దర్శకుడు భరత్ కృష్ణమాచారి గతంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లిలో చిత్రీకరించిన ఒక సన్నివేశంలో, కింద నది ప్రవహిస్తుండగా కేవలం ఒకే ఒక్క హార్నెస్ సాయంతో ఆమె రెండు రోజుల పాటు తాడుపై వేలాడుతూ పర్వతాన్ని అధిరోహించారని వివరించారు. ఈ సినిమా కోసం హీరో నిఖిల్ కూడా వియత్నాం వెళ్లి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. రెండు చేతులతో కత్తి యుద్ధం చేయడంలో ఆయన ప్రావీణ్యం సంపాదించారు. కేవలం హీరో, హీరోయిన్లు మాత్రమే కాకుండా సినిమాలో నటించిన వందలాది మంది సహాయ నటీనటులకు కూడా వియత్నాం నుంచి వచ్చిన నిపుణులతో కత్తి యుద్ధంలో శిక్షణ ఇప్పించారు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో దాదాపు 60 రోజుల పాటు భారీ క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. భారతీయ సాంస్కృతిక వారసత్వపు మూలాలతో, ఒక యోధుడి గాథ ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. భారీ తారాగణం, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న 'స్వయంభూ' విడుదల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.